


రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరి ష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించ నున్నట్లు కలెక్టర్ రంజిత్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని సూచించారు.

ధర.. దగా



ధరలు పతనమయ్యాయి. కష్టజీవులు దగా పడుతున్నారు. రైతులు కష్టపడి ఉల్లి, టమోటా పండించారు. నాణ్యత పేరిట వ్యాపారులు మాయ చేస్తున్నారు. క్వింటా ఉల్లి రూ.1,200లకు కొనుగోలు చేస్తామని కూటమి ప్రభుత్వం భరోసా ఇచ్చింది. కొంతైనా పెట్టుబడి కష్టాలు తీరుతాయని అన్నదాతలు ఆనందించారు. వారం తిరక్కుండానే మేము కొనుగోలు చేయలేం అంటూ ఏపీ మార్క్‌ఫెడ్ చేతులెత్తేసింది. ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కర్నూలు మార్కెట్ యార్డు కూడలిలో రైతులు రోడ్డెక్కి ధర్నాకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

కర్నూలు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉల్లి, టమోటా ధరలు పతనం కావడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడి మాట దేవుడెరుగు. పంట కోత, రవాణా ఖర్చులు కూడా రావడం లేదంటూ ఏకరువు పెడుతున్నారు. రాష్ట్రంలో అత్యధికంగా ఉల్లి సాగు చేస్తున్న జిల్లాల్లో కర్నూలు అగ్రస్థానం ఉంటుంది. దేవనకొండ, సి.బెళగల్, గూడూరు, నందవరం, ఎమ్మిగనూరు, గోనేగండ్ల, ఆస్పరి, కోసిగి, ఆదోని మండలాల్లో ఉల్లి అధికంగా సాగుచేశారు. ఈ ఖరీఫ్‌లో 10,797 హెక్టర్లలో ఉల్లి పంట వేశారు. గతంలో బోరుబావుల కింద ఒక్కటే సాగు చేస్తే, ప్రస్తుతం వర్షాధారంగా కూడా సాగుచేస్తున్నారు. ఎరువులు, పురుగుమందులు, సేద్యం, కూలీ రేట్లు పెరగడంతో పెట్టుబడి పెరిగి ఉల్లి సాగు భారంగా మారింది. దుక్కులు, పంట కోత, రవాణా కలుపుకొని ఎకరాకు రూ.85వేల నుంచి రూ.1.25లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. ఎకరాకు 80 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని ఉద్యాన శాఖ అధికారుల అంచనా. పెట్టుబడిపై 50 శాతం రైతుకు లాభం ఉండేలా 'కనీస మద్దతు ధర' నిర్ణయించాలని జస్టిస్ స్వామినాథన్ కమిటీ సిఫారసు చేసింది. ఈ లెక్కన క్వింటా రూ.2 వేలు పలికితేనే రైతులకు గిట్టుబాటు అవుతుంది. పంట చేతికొచ్చే సమయంలో కర్నూలు మార్కెట్‌లో ఉల్లి ధరలు పూర్తిగా పతనం అయ్యాయి. కూలీ, రవాణా ఖర్చులు కూడా రావడం లేదంటూ రైతులు కన్నీరు పెడుతున్నారు.

ఆరు రోజులకు చేతులెత్తేసిన మార్క్‌ఫెడ్

ఉల్లి రైతులను ఆదుకోవడానికి సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం ముందుకొచ్చింది. మద్దతు ధర రూ.1,200 నిర్ణయించి ఆ ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని భరోసా ఇచ్చింది. కర్నూలు మార్కెట్‌యార్డులో గత ఆది వారం ఏపీ మార్క్ ఫెడ్ ద్వారా క్వింటా రూ.1,200కు కొనుగోలుకు శ్రీకారం చుట్టారు. పెట్టుబడి కష్టాలు తీరుతాయని రైతులు ఆశించారు. ఆరు రోజుల్లో 1,200 టన్నులు ఉల్లి ఏపీ మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసింది. 200టన్నులు ఇతర జిల్లాల్లోని రైతుబజార్లకు తరలించింది. వెయ్యి టన్నులు ఉల్లి కర్నూలు మార్కెట్‌లోనే నిలిచిపోయింది. కొనుగోలు చేసిన ఉల్లి బయటకు వెళ్లడం లేదు. దీనికి తోడు రోజుకు 3-5 వేల క్వింటాళ్ల దిగుబడులు మార్కెట్‌కు వస్తుంది. కొనుగోలు చేసిన ఉల్లి నిల్వలు ఆగిపోవడం, కొత్తగా కొనుగోలు చేసే ఉల్లి నిల్వలు ఎక్కడ ఉంచాలో తెలియని పరిస్థితి. కొనుగోలు చేయలేమంటూ ఏపీ మార్క్ ఫెడ్ అధికారులు చేతులెత్తేశారు.

- ఉల్లి, టమోటా ధరలు పతనం
- ఉల్లి కొనుగోళ్లపై చేతులెత్తేసిన ఏపీ మార్క్‌ఫెడ్
- బోనస్ ఇస్తామంటున్న అధికారులు
- క్వింటా రూ.1,200కు ప్రభుత్వమే కొనుగోలు చేయాలి
- మార్కెట్‌యార్డు కూడలిలో రైతన్నల ఆందోళన





బస్టాండు వద్ద రోడ్డుపై బైఠాయించిన రైతులు

రోడ్డెక్కిన రైతన్నలు

ఏపీ మార్క్‌ఫెడ్ ఉల్లి కొనుగోళ్లను శనివారం ఆపేసింది. కర్నూలు మార్కెట్‌కు 4,127 క్వింటాళ్ల ఉల్లి దిగుబడులు రైతులు తీసుకొచ్చారు. కనిష్టంగా రూ.501లు, గరిష్టంగా రూ.1,249 ధర పలికితే, మధ్యస్థ ధర రూ.628 పలికిందని మార్కెట్ అధికారులు తెలిపారు.ప్రభుత్వం కొనుగోలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ రైతులు రోడ్డెక్కారు. మార్కెట్‌యార్డు కూడలిలో ధర్నాకు దిగారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గళమెత్తారు.

మిగతా 6వ పేజీలో

టెక్నాలజీని ప్రోత్సహిస్తున్న సీఎం

- పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్
- 'కుడా' నిధులతో నగరంలో 100 సీసీ కెమెరాలు



చెక్కును ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు అందజేస్తున్న మంత్రి టీజీ భరత్, కలెక్టర్ రంజిత్ బాషా, జేసీ నవ్య, 'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు కొత్త టెక్నాలజీని ప్రోత్సహిస్తూ ఉంటారని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ అతిథిగృహంలో 100 సీసీ కెమెరాల ఏర్పాటుకు సంబంధించి కుడా నిధులు రూ.29.84లక్షల చెక్కును మంత్రితో కలిసి కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు అందించారు. ఈసందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ నగరంలో ఏఐ టెక్నాలజీతో కూడిన 100 సీసీ కెమెరాలను కుడా నిధులతో ఏర్పాటు చేస్తారన్నారు. సోమిశెట్టి మాట్లాడుతూ నగరం శాంతి భద్రలతో ప్రశాంతంగా ఉండేందుకు, నేరాల నియంత్రణకు తోడ్పాటు అందించాలన్న లక్ష్యంతో కుడా నిదులు మంజూరు చేశామ న్నారు. కలెక్టర్ రంజిత్‌బాషా మాట్లాడుతూ రహదారి భద్రతలో భాగంగా ట్రాఫిక్ నియంత్ర ణకు వీలుగా నగరంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారన్నారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ నగరంలో 250 కెమెరాలతో నియంత్రణకు వీలుగా పకడ్బందీ భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, కుడా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు పోలీసుల సస్పెన్షన్

కర్నూలు క్రైం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో ముగ్గురు పోలీసులను సస్పెండ్ చేస్తూ ఎస్పీ విక్రాంత్ పాటిల్ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీరామ్ ప్రసాద్ (నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్), రాజేశ్ (కర్నూలు తాలుకా పోలీస్ స్టేషన్), హోంగార్డు నబీసా (కర్నూలు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్)ను సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల రాబరి కేసు నమోదైంది. ఓ ప్రేమ జంటను బెదిరించి వారి నుంచి దోపిడీ చేశారు. ఈ కేసులో నిందితులు నాగేంద్ర, రమేష్, మాలిక్‌బాషాను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. నిందితులతో ఈ ముగ్గురు కానిస్టేబుళ్లు తరుచూ మాట్లాడుతుండటం, నిందితులు నేరం చేసిన విషయం తెలిసినా కూడా ఉన్నతాధికారులకు తెలపకపోవ డంపై ఎస్పీ సీరియస్‌గా తీసుకున్నారు. క్రమశిక్షణా చర్యల్లో భాగంగా వారిని విధుల నుంచి తప్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఉద్యోగుల సంక్షేమానికి తొలి ప్రాధాన్యం

- అటవీ భూములను కాపాడుకుంటాం
- ఏపీ అటవీ శాఖ సలహాదారు మల్లికార్జునరావు



అటవీ అధికారులతో సమీక్షిస్తున్న ఆ శాఖ ప్రభుత్వ సలహాదారు మల్లికార్జునరావు

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సంక్షేమానికి తొలి ప్రాధాన్యత ఇస్తామని ఏపీ అటవీ శాఖ సలహాదారు పి.మల్లికార్జునరావు తెలిపారు. శనివారం ఆయన కర్నూలుకు వచ్చారు. గార్గేయపురం సమీపంలో నగరవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ అటవీ శాఖ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడుకుంటామన్నారు. వాటి అభివృద్ధికి ప్రణాళికబద్ధంగా అడుగులు వేస్తామని చెప్పారు. ఉద్యోగులు సైతం విధి నిర్వహణలో అంకితభావంతో పని చేయాలని, వారి సంక్షేమం, సమస్యల పరిష్కారానికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో సీఎఫ్ యశోదాబాయి, డీఎఫ్‌వో శ్యామల, అటవీ శాఖ ఉన్నతాధికారులు విజ్ఞేస్ అప్పావు, నాగమునీశ్వరి, వినీత్, రవిశంకర్, శివకుమార్, విజయ్‌కుమార్, తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'పల్లెకు పోదాం'

- జిల్లాలోని 79 గ్రామాల్లో ప్రారంభం
- కలెక్టర్ రంజిత్ బాషా



పర్లలో పర్యటిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కల్లూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సమస్యల పరిష్కారం కోసం 'పల్లెకు పోదాం' చేపట్టినట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. శనివారం ఈకార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ సంస్థలు, వ్యవస్థల పనితీరును పరిశీలించి జిల్లా మండలానికి మూడు చొప్పున 79 గ్రామాల్లో స్పెషల్ ఆఫీసర్లు పల్లెకుపోదాం కార్యక్రమం చేపట్టారు. గ్రామాల్లో నెలకొన్న పరిస్థితులు. పరిష్కరించాల్సిన సమస్యలను పల్లెకుపోదాం ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో పొందుపరచాలని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. కల్లూరు మండలం పర్ల గ్రామంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లు, హాస్పిటల్, గ్రామ సచివాల యం, ప్రభుత్వ బాలుర వసతి గృహం, రోడ్లు, నీటి సరఫరాను తనిఖీ చేశారు. పర్ల నుంచి చిన్నటేకూరు. సింగవరం వెళ్లే ఆర్ అండ్‌బీ రోడ్డుపై ఉన్న కల్వర్టు బ్రిడ్జి నిర్మాణాన్ని కూడా మంజూరు చేశారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్లపై ఆగ్రహం

ఓవర్‌హెడ్ స్టోరేజీ ట్యాంకులను కలెక్టర్ పరిశీలించి ప్రతిరోజూ క్లోరినేషన్ పరీక్షలు నిర్వహించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈని ఆదేశించారు. క్లోరినేషన్ పరీక్షలు సరిగా చేయలేదంటూ ఇంజనీరింగ్ అసిస్టెంట్లపై అసహనం వ్యక్తం చేశారు. ఇద్దరు ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసు జారీచేసి వివరణ కోరాలని కలెక్టర్ ఎంపీడీవోను ఆదేశించారు. పర్లలో ఈ-క్రాఫ్‌బుకింగ్ శాతం తక్కువగా ఉందని, పురోగతి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, సెప్టెంబరు 20 నాటికి ఈ-క్రాప్ బుకింగ్ పూర్తి చేయాలని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్స్‌ను కలెక్టర్ ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి మండల ఫండ్ ద్వారా మరమ్మతులో ఉన్న భవనాన్ని త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.

ట్రంప్ టారిఫ్‌లను వ్యతిరేకించాలి

- వామపక్షాల నాయకులు
- కలెక్టరేట్ ఎదుట నిరసన



నిరసనలో మాట్లాడుతున్న వామపక్షాల నాయకులు

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ట్రంప్ టారిఫ్‌ల(సుంకాల) పెంపును ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని వామపక్షాల నాయకులు పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్ ఎదుట సీపీఎం, సీపీఐ నగర కార్యదర్శులు రాజశేఖర్, సి.మహేష్ అధ్యక్షతన నిరసన వ్యక్తం చేశారు. ఎపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప మాట్లాడుతూ ట్రంపు భారతదేశంపై వేసిన పన్ను కారణంగా దేశంలో అత్యధి కంగా నష్ట పోయేది ఆంధ్రప్రదేశ్‌యే అన్నారు. కూటమి పాలకులే కాకుండా వైసీపీ అధినేత వైఎస్ జగన్ కూడా టారిఫ్‌పై స్పందించకపోవడం దారుణ మన్నారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, జగన్నాథం, శ్రీనివాసులు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జీఎన్‌ఎంలో ప్రవేశానికి దరఖాస్తులు

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఏపీ వైద్య విద్య డైరెక్టర్ 2025-26 విద్యా సంవత్సరానికి జీఎన్‌ఎం కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు రాష్ట్రంలోని ప్రభుత్వ, నర్సింగ్ స్కూళ్లలో అడ్మిషన్లు చేపట్టనున్నట్లు అధికారులు ప్రకటించారు. జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ (జీఎన్‌ఎం) కోర్సుల్లో చేరడానికి విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, అర్హతలు, వయో పరిమితి, దరఖాస్తు విధానం సీట్లు లభ్యత వంటి వివరాలు నోటిఫికేషన్‌లో పొందుపరిచారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ కార్యాలయంలో దరఖాస్తులను ఈ నెల 22వ తేదీ వరకు ఉదయం 10నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్వీకరిస్తారని సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు నిర్ణీత గడువులోపు దరఖాస్తులు సమర్పించాలన్నారు.

అత్యాధునిక టెక్నాలజీతో టిడ్కో గృహాలు

- మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): అత్యాధునిక టెక్నాలజీతో టిడ్కో గృహాలను నిర్మిస్తున్నట్లు మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ అన్నారు. నగర శివారులోని టిడ్కో గృహాలను పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్, కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జేసీ బి.నవ్య, నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్, ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, బొగ్గుల దస్తగిరితో కలిసి శనివారం పరిశీలించారు. ముందుగా టిడ్కో అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి నారాయణ మాట్లాడుతూ సింగపూర్, మలేసియా, జపాన్, చైనా, రష్యా తదితర అభివృద్ధి చెందిన దేశాలలో షేర్ వాల్ టెక్నాలజీతో గృహాలు నిర్మిస్తారని, అదే టెక్నాలజీని వినియోగించాలని ప్రభుత్వం ఆలోచిస్తోందని చెప్పారు. సౌకర్యవంతమైన రోడ్లు, డ్రైనేజీ, పార్కులు, కమ్యూనిటీ హాల్స్ పాఠశాల తదతర కనీస సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. జిల్లాలో రెండు నెలల్లో మరికొన్ని చోట్ల అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తామన్నారు. టిడ్కో సముదాయాల్లో ఉన్న కంపచెట్లను త్వరితగతిన తొలగించాలని అధికారులను ఆదేశించారు. డిసెంబరుకల్లా 3,056 గృహాలను పూర్తి చేస్తామని, మిగతా 3,826 గృహాలు వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. ప్రజాప్రతినిధుల కోరిక మేరకు టిడ్కో గృహ సముదాయానికి ఒక పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేస్తామని, అది కూడా కలెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తామన్నారు. ఆర్టీసీ బస్సు సౌకర్యం కూడా త్వరలో వస్తుందన్నారు. మరిన్ని మౌలిక వసతులకు రూ.5 కోట్లు మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. మంత్రి టీజీ భరత్ కోరిక మేరకు ఇక్కడే పది ఎకరాల స్థలాన్ని ఎంఎస్‌ఎంఈ కింద పరిశ్రమ ఏర్పాటు చేయడానికి ఇస్తున్నామన్నారు. నగరంలో ఆక్రమణలకు గురైన పార్కు స్థలాలను కమిషనర్ ద్వారా విచారణ చేయించి చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న మున్సిపల్ మంత్రి నారాయణ

ఎంఎస్‌ఎంఈ కింద ఉద్యోగావకాశాలు: మంత్రి భరత్

ఎంఎస్‌ఎంఈ కింద యువతకు ఉద్యోగావకాశాలు వస్తాయని పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్‌ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. పరిశ్రమ ఏర్పాటు వల్ల కాలనీలో ఉండే వెయ్యి కుటుంబాలకు ఉపాధి లభిస్తుందన్నారు. గృహ సముదాయంలో ఉన్న జంగిల్ క్లియరెన్సు ఆదివారం సాయంత్రానికి కల్లా పూర్తి చేసి వాటికి సంబంధించి ఫోటోల మంత్రి నారాయణకు పంపాలని ఆదేశించారు. త్వరలోనే కాంట్రాక్టర్లకు రూ.6 కోట్లు విడుదల చేయనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం టిడ్కో గృహాలను పట్టించుకోలేదని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక లబ్ధిదారులకు ఇళ్లు అందజేయాలనే ఉద్దేశ్యంతో ఇక్కడ ఉన్నటువంటి సమస్యలను పరిష్కరించే విధంగా మంత్రి చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలనే ఉద్దేశ్యంతోముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టిడ్కో, 'కుడా' అధికారులు పాల్గొన్నారు.

'హంటర్' ఆన్ డ్యూటీ..

- పోలీసు శాఖకు నూతన జాగిలం
- పేలుడు పదార్థాలను గుర్తించడంలో దిట్ట
- పరిశీలించిన ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వివిధ కేసుల చేదనలో, నేరస్థులను గుర్తించడంలో, పోలీసు శాఖ మరింత బలోపేతం అయ్యేందుకు కర్నూలు జిల్లా పోలీసు శాఖకు నూతన జాగిలం హంటర్‌ను కేటాయించారు. ఈహంటర్ విజయవాడ మంగళగిరి హెడ్ క్వార్టర్స్ 6వ బెటాలియన్‌లో పది నెలల పాటు పేలుడు పదార్థాలు గుర్తించడంలో శిక్షణ పొందింది. ఈ సందర్భంగా శనివారం జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చిన 'హంటర్'ను ఎస్పీ విక్రాంత్ పాటిల్ పరిశీలించారు. ఈ సందర్భంగా డాగ్ స్క్వాడ్ సిబ్బందికి ఎస్పీ పలు సూచనలు చేశారు. హంటర్ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ జాగిలంతో మొత్తం డాగ్ స్క్వాడ్‌ల సంఖ్య 9కి చేరిందన్నారు. ఇది బెలిజయం మలనాయిస్ జాతికి చెందినది అని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ జావేద్, డాగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి ఏఆర్ కానిస్టేబుల్ రాజు, డాగ్ హ్యాండ్లర్ ఏఆర్ కానిస్టేబుల్ శేఖర్ తదితరులు ఉన్నారు.




'హంటర్'ను పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

ఘనంగా 5కే రన్

- ప్రారంభించిన ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో
- కోల్స్ కాలేజీ నుంచి నంద్యాల చెక్‌పోస్టు వరకు సాగిన పరుగు 6

యువకుడి దారుణ హత్య 7

తుంగభద్ర తీరం
సాహిత్యం



సామాజిక స్పృహకు ప్రతిబింబం
కవితా(వి)హారం

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని అనేక రుగ్మతలపై స్పందిస్తూ.. పాఠకుల్లో సామాజిక చైతన్య స్పృహను మేల్కొలిపేలా నిలుస్తుంది 'కవితా(వి)హారం కవితా సంకలనం. 'పొత్తపు పొత్తిళ్లలో తానొక అక్షరమై అన్నట్లు..' రచయిత క్రిష్టిపాటి పట్టాభిరామ శర్మ ఈ పుస్తకాన్ని వెలువరించారు. జిల్లాలోని పంచాయతీ రాజ్ శాఖలో సీనియర్ సహాయకులుగా పనిచేస్తున్న ఈయనకు తెలుగు భాషపై ఉన్న అభిమానం సామాన్యమైనది కాదు. అది ఎంత ఉన్నత స్థాయిలో ఉందో ఈయన కవితా(వి)హారంలో అవగత మవుతుంది. మాతృ భాషపై శర్మకు ఉన్న అభిమానం, తెలుగు పదజాలం పైన ఉన్న గట్టిపట్టు, ఈకవితా సంకలనంలో ప్రయోగించిన అద్భుత పద ప్రయోగాలు వ్యక్తం చేస్తాయి. అంత్య ప్రాసలు, ఆంగ్ల పదాలకు సరైన తెలుగు అనువాద పదాలు, దీర్ఘ సమాస పదబంధాలు, వినూత్న పదవైచిత్రాలు చూస్తే అర్థమవుతుంది. 'పనిమొగ్గల కాల రాచు పాషాణుల దుశ్చేష్ట/ పడగ విప్పిన పాశవికతకు పరాకాష్ట' అంటూ సాగే కవితా పంక్తుల్లో ప్రాస పదాలు కవితను పరిపుష్టం చేస్తాయి. 'అంకురార్పణ' అనే కవితలో పర్యావరణ పరిరక్షణ కోసం తపించే ప్రకృతి ప్రేమికుడిగా సామాజిక సందేశాన్ని ప్రబోధిస్తూ, 'తరు మేధాన్నవుదాం' అనడంలో, నరమేధ వలె తరుమేధ సైతం అత్యంత ప్రమాదకర మన్న విషయాన్ని సూచించారు. పక్షిజాతులు అంతరించిపోవ డానికి కారణమైన సెల్‌ఫోన్స్ టవర్ల గురించి ప్రస్తావించే సందర్భంలో 'చరవాణి స్తూప ధాటికి' అనడం, ఆసిడ్ దాడుల ప్రస్తావనలో ఆమ్లీకృతమొనర్చడం అనడం, ధనాన్ని 'కక్షలు, కార్పణ్యాలు రగిలించే భాస్వరం'తో పోల్చడం వినూత్నంగా అనిపిస్తాయి. పుస్తక రచయిత శర్మ తన ప్రతి కవితలోనూ భావ ప్రకటనా వైవిధ్యాన్ని ప్రదర్శిస్తూ, తెలుగు భాషపై తనకున్న పట్టును రుజువు చేసుకోవడంలో సఫలీకృతులయ్యారు. 'చరవాణిని కరతల పేటికగా వర్ణిస్తూ రాసిన కవితలో 'అరచేత వైకుంఠమును చూపు మాయల మరాఠీ' అని చమత్కరించడం ఆకట్టుకుంటుంది. రచయిత కవితల్లో వృద్ధాప్యంలో అనాథలవుతున్న తల్లిదండ్రులు, అరాచకా లకు బలవుతున్న స్త్రీలు, సైనికులు, రైతులు ప్రధాన భూమికను పోషించారు. ఆధునిక భారతదేశ సామాజిక పరిస్థితులపై కలత చెందుతూ, ఆయా సందర్భాలను నిష్కర్షగా విమర్శిస్తూ నిరసన వెలిబుచ్చారు. మాతృభాష పరిరక్షణకై అన్న కవితలో మాతృభాష వర్ణించే విధానం మహాకవి శ్రీశ్రీ మహాప్రస్థానంలోని కవితా పంక్తులను తలపింపజేస్తుంది. తెలుగు కనుమరుగు కాకుండా ఉండాలంటే 'పానుగంటి వారి సాక్షి సంపుటాలు పడగ విప్పాల్సిందే, అడుగడుగునా జంఘాల శాస్త్రులు పంజా విసరాల్సిందే' అంటూ ముక్తియించారు. మానవ దేహాన్ని 'జ్ఞాన కర్మేంద్రియ షట్చక్ర సహిత రక్తమాంస సమ్మిశ్రిత శల్య మల భవన భగవత్ ప్రసాదిత దేహం'గా అభివర్ణించడం అబ్బురపరుస్తుంది. వృత్తికి సంబంధం లేని ప్రవృత్తిని ఎంపిక చేసుకుని శర్మ చేస్తున్న అవిరళ సాహిత్య కృషి అభినందనీయం. శ్రీకన్యకా పరమేశ్వరి దేవి చరిత్ర, శ్రీవారి బ్రహ్మోత్సవ రూపకాలు, తుంగభద్ర పుష్కర గీతము అనే మూడు పుస్తకాలు ముద్రించిన శర్మ నాలుగో పుస్తకంగా 'కవితా(వి)హారము పాఠకులకు అందించారు. రచయిత శర్మ కలం నిరంతర కవన సృజన చేస్తూ, మరెన్నో కవితా సుమాలను విరబూయిం చాలని, తెలుగుతల్లి సిగలో అలంకరించాలని మనఃస్ఫూర్తిగా కాంక్షిస్తున్నాను. ఈ పుస్తకం ఆదివారం కర్నూలులో వెంకటరమణ కాలనీ సాయిరాఘవ రెసిడెన్సీలో ఆవిష్కరిస్తున్నారు. త్వరలో అన్ని ప్రముఖ పుస్తక విక్రయశాలల్లో అందుబాటులోనికి రానుంది.



● కర్నాటి చంద్రమౌళిని, రచయిత్రి, కర్నూలు

కందనవోలు సాహిత్యంపై భాస్కర ముద్రికలు

- వందలాది పుస్తకాల ప్రచురణకు ప్రోత్సాహకాలు
- బహుముఖ రూపాల్లో రాణిస్తున్న ముద్రణా సంస్థ అధినేత
- కార్టూనిస్టు నుంచీ సాహితీ సంస్థ వ్యవస్థాపకుడిగా గుర్తింపు



ప్రింటింగ్‌లో ప్రూఫ్స్ సరిచూసుకుంటున్న భాస్కర్

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలు సాహిత్యరంగంతో ఆయనకు ఎనలేని అనుబంధం ఉంది. ఒకటి కాదు, రెండు కాదు...సుమారు రెండున్నర దశాబ్దాలకు పైగా ఆబంధం కొనసాగుతోంది. ఔత్సాహిక రచయితలు, కవులు తాము రాసిన సాహిత్యాన్ని పుస్తక రూపంలో భద్రపరచుకోవాలంటే వెంటనే గుర్తొచ్చే పేరు ఆయనది. జిల్లాలో ఎందరో సాహితీవేత్తల పుస్తకాలు ఆయన ముద్రణా యంత్రం ద్వారానే వెలుగు చూశాయి. అనేక పుస్తకాలను ఆయన ప్రూఫ్‌లు (తప్పొప్పులు సరిదిద్దడం) చేసి అందమైన పుస్తక రూపాల్లో బయట ప్రపంచానికి అందించారు. ఆర్థిక ఇబ్బందుల మధ్య నలిగిపోయే అనేక మందికి కూడా ఆయన ఏమీ ఆశించకుండా వారి పుస్తకాలను వెలుగు బాట పట్టించారు. ఆయనే కర్నూలుకు చెందిన పోలూరు విజయ భాస్కర్.. అలియాస్ ముద్రిక భాస్కర్. ఇంటి పేరు కన్నా, ముద్రిక అనే ప్రింటింగ్ ప్రెస్ పేరుతో ఆయన జిల్లా సాహిత్యరంగానికి సుపరిచితులు. డిగ్రీ చదివాక తెలుగు భాషపై మమకారం, రచనా వ్యాసంగం పట్ల ఆసక్తి, పుస్తకాల ప్రచురణలపై అభిరుచి, సుప్రసిద్ధ సాహితీమూర్తులతో ఉన్న అనుబంధం ఆయన్ను సాహిత్య రంగంపై ఎదిగేలా చేశాయి. 1980 దశకంలోనే జిల్లాలో తొలి రాజకీయ కార్టూనిస్టుగా వినతికెక్కిన ఆయన తర్వాత ఇన్‌టాక్ సంస్థలో జిల్లా కన్వీనర్‌గా జిల్లాలోని అనేక చారిత్రక ప్రాంతాలను వెలుగులోకి తీసుకురావడంలో కృషి చేశారు.

> ఇంటి పేరు కన్నా, ముద్రిక అనే ప్రింటింగ్ ప్రెస్ పేరుతో ఆయన జిల్లా సాహిత్యరంగానికి సుపరిచితులు. తెలుగు భాషపై మమకారం, రచనా వ్యాసంగం పట్ల ఆసక్తి, పుస్తకాల ప్రచురణలపై అభిరుచి, సుప్రసిద్ధ సాహితీమూర్తులతో ఉన్న అనుబంధం ఆయన్ను సాహిత్య రంగంపై ఎదిగేలా చేశాయి. ఒకటి కాదు, రెండు కాదు.. సుమారు రెండున్నర దశాబ్దాలకు పైగా ఆబంధం కొనసాగుతోంది. ఔత్సాహిక రచయితలు, కవులు తాము రాసిన సాహిత్యాన్ని పుస్తక రూపంలో భద్రపరచుకోవాలంటే వెంటనే గుర్తొచ్చే పేరు ఆయనది. కర్నూలుకు చెందిన పోలూరు విజయ భాస్కర్.. అలియాస్ ముద్రిక భాస్కర్.

బాల్యం, విద్యాభ్యాసం..

ఉమ్మడి జిల్లాలోని నంద్యాల పట్టణంలోగల నూనెపల్లెకి చెందిన పోలూరు ఈశ్వరమ్మ, కొండయ్య దంపతులకు ఏకైక కుమారుడిగా భాస్కర్ జన్మించారు. ఆయన ప్రాథమిక విద్య నంద్యాలలోనే జరిగింది. తండ్రి వృత్తిరీత్యా దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉద్యోగి కావడంతో చదువు కూడా వివిధ ప్రాంతాల్లో కొనసాగింది. హైదరాబాదులో పది వరకు చదువుకున్న భాస్కర్ 1974లో పది పాసయ్యాక ఇంటర్ కర్నూలు ప్రభుత్వ జూనియర్ కళా శాల్లో చదువుకోవాల్సి వచ్చింది. ఇంటర్ పూర్తయ్యాక బీకాం ఉస్మానియా కళాశాల్లో చదువుతుండగా, తిరిగి తండ్రికి శ్రీకాళహస్తికి బదిలీ కావడంతో డిగ్రీ అక్కడ చదువుకున్నారు. డిగ్రీ పూర్తయ్యాక తిరుపతిలో ఎంఏ చేరారు.

చిత్తూరులో ప్రముఖ రచయితలతో..

తండ్రి చిత్తూరు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తుండగా, అక్కడే ప్రముఖ రచయి తలతో సాంగత్యం ఏర్పడింది. ముఖ్యంగా చిత్తూరు సెంట్రల్ లైబ్రరీలో జరిగే సాహిత్య సమావేశాలకు మధురాంతకం రాజారాం, పులికంటి కృష్ణారెడ్డి, ఎస్ మునిసుందరం వంటి ప్రముఖులు తరచూ విచ్చేసేవారు. ఎస్ మునిసుందరంతో మంచి పరిచయం ఏర్పడింది. అదే సమయంలో పత్రికల్లో చిత్రకారుడిగా చందమామ పత్రికకు ప్రయత్నించారు.



కర్నూలు ఇన్‌టాక్ కోకన్వీనర్‌గా కేతవరంలో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తూ..

జిల్లా చరిత్రపై పరిశోధనలు...

జిల్లా పురావస్తు చరిత్ర, పర్యాటక ప్రాంతాలపై ఆసక్తితో ఇన్‌టాక్ సంస్థలో సభ్యుడిగా ఉంటూ జిల్లా కన్వీనర్ స్థాయికి ఎదిగారు. సహచర ఇన్‌టాక్ మిత్రులతో జిల్లాలోని అనేక ప్రాంతాలను వెలుగులోకి తీసుకువచ్చారు. అలా కేతవరం గృహలను వెలుగులోకి తీసుకువచ్చిన బృందంలో ఒకరిగా ముద్రిక భాస్కర్ నిలిచిపోతారు. ఇన్‌టాక్ సంస్థ ద్వారా అనేక కార్యక్రమాలను రూపొందించడంతోపాటూ రాయలవారి 500 పట్టాభిషేక మహోత్సవాన్ని పుస్తకరూపంలో ముద్రించారు. ఈ పుస్తక సంపాదక వర్గంలో ఒకరిగా భాస్కర్ సేవలు అందించారు.

సాహిత్యానికి పెద్దపీట..

సాహిత్య రంగంలో తనకుంటూ ఉన్న మమకారంతో అనేక సాహిత్య కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 1989 ఏప్రిల్ 4న శ్యామలతో వివాహం జరిగింది. తన కుమార్తె ముద్రిక పేరుతో, భార్య ప్రోత్సాహంతో 1991లో ముద్రిక ప్రింటింగ్ ప్రెస్‌ను ప్రారంభించారు. అంతకు ముందు సుమారు పదేళ్లు క్వాలిటీ ప్రింటర్స్ ప్రెస్‌లో పనిచేసిన అనుభవంతో ముద్రణా రంగంలో ముందుకు పోయారు. స్వతహాగా సాహిత్యాభిలాషి అయిన భాస్కర్ జిల్లాకు చెందిన అనేక మంది రచయితలు, కవుల పుస్తకాలను వెలుగులోకి తీసుకు వచ్చారు. కొందరికి ఉచితంగానే పుస్తకాలను ముద్రించి వారు పేరు, గుర్తింపు తెచ్చుకునేలా వెన్నంటి నిలిచారు. స్వయంగా ముద్రిక కళా స్రవంతి సాహిత్య సంస్థను నెలకొల్పి, అనేక మంది కవులు, రచయితలను వేదిక కల్పించారు. తెరచాటున ఉన్న సాహితీవేత్తలకు వేదిక కల్పించి వారికి సన్మాన సత్కారాలతో తగిన గుర్తింపు తీసుకువస్తున్నారు. జిల్లా సాహితీ చరిత్రను భావి తరాలకు అందించడమే తన లక్ష్యంగా ముద్రిక భాస్కర్ చెబుతున్నారు. చరిత్ర అధ్యయనానికి పుస్తకాలే నిజమైన అక్షర రూపాలని ఆయన అంటున్నారు.



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న భాస్కర్

తొలి రాజకీయ కార్టూనిస్టుగా రాణింపు..



తండ్రి పదవీవిరమణ అనంతరం కర్నూలుకు చేరుకున్న ముద్రిక భాస్కర్ కార్టూనిస్టుగా వందలాది కార్టూన్లు గీశారు. 1980 దశకంలో ఓ ప్రముఖ పత్రికకు రాజకీయ కార్టూనిస్టుగా భాస్కర్ నిత్యం కార్టూన్లు వేశారు. సుమారు పది సంవత్సరాల్లో వేలాది కార్టూన్లు వేశారు. అవి వివిధ పత్రికల్లోనూ ప్రత్యేక గుర్తింపు పొందాయి.

11న కళా ఉత్సవ్ పోటీలు

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బి.తాండ్రపాడు డైట్ కళాశాలలో ఈ నెల 11వ తేదీన జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీలు 11 అంశాల్లో నిర్వహించబడుతాయని డైట్ ప్రిన్సిపాల్ అయూబ్ హుశేన్ శని వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, కేంద్రీయ విద్యాలయ, నవోదయ, రెసిడెన్షియల్‌తో పాటు మేనేజ్‌మెంట్ పాఠశాలల్లో 9, 10, 11, 12 తరగతులు చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని వివరించారు. సంగీతం, నృత్యం, నటన, చిత్రకళ వంటి 11అంశాల్లో పోటీలు నిర్వహించబడుతాయని పేర్కొ న్నారు. ఈ పోటీల్లో పాల్గొనదలచిన వారు ఈ నెల 8వ తేదీన సాయంత్రం లోపు కళాశాల అధ్యాపకులు వి.మాధురిని 8801761409ను సంప్రదించి పోటీకి సంబంధించిన వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. పోటీలో పాల్గొనే విద్యార్థులు తమ ఉపాధ్యాయుల ద్వారా మాత్రమే శిక్షణ పొంది ఉండాలని, మేకప్, ఇతర సామగ్రిని వెంట తెచ్చుకోవాలని కోరారు.

ఘనంగా 5కే రన్

- ప్రారంభించిన ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో
- కోల్స్ కాలేజీ నుంచి నంద్యాల చెక్‌పోస్టు వరకు సాగిన పరుగు



విజేతలతో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో, జిల్లా క్రీడాశాఖ అధికారి

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, జిల్లా క్రీడాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా స్థాయి మారథాన్ 5కే రన్ పోటీలు శనివారం కోల్స్ కాలేజీ వద్ద ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.ఎల్.భాస్కర్ ప్రారంభించారు. ఈ పరుగు పోటీల్లో జిల్లాలోని వివిధ కాలేజీలకు చెందిన 58 మంది విద్యార్థినులు, 55 మంది విద్యార్థులు, 5 మంది ట్రాన్స్‌జెండర్లు పాల్గొన్నారు. ఈ పోటీలు కోల్స్ కాలేజీ నుంచి పార్కు రోడ్డు, రాజ్‌విహార్, కర్నూలు మెడికల్ కాలేజీ, సీ.క్యాంపు, నంద్యాల చెక్‌పోస్టు వరకు సాగింది. మొదటి విజేత బహుమతి టీ.నాగ శ్రీనివాసులు రూ.10వేలు, రెండో విజేతగా సి.హరికృష్ణకు రూ.7వేలు, మహిళా విభాగంలో మొదటి విజేత మద్దూరు రేణుకకు రూ.10వేలు, రెండో బహుమతి విజేత సీ.దేవికి రూ.7వేలు, ట్రాన్స్‌జెండర్ విభాగంలో మొదటి బహుమతి విజేత లీలా ప్రసాద్‌కు రూ.10వేలు, రెండో విజేత రక్షితకు రూ.7వేలు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో మాట్లాడుతూ యువతలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు ఈ 5కే రన్‌ను నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ అలిహైదర్, ఏపీ శాక్స్ ప్రోగ్రాం గణాంక అధికారి దేవి శంకర్‌గౌడు, జిల్లా క్రీడాశాఖ కోచ్‌లు వివిధ కాలేజీ అధ్యాపకులు, ఎన్‌జీవోలు పాల్గొన్నారు.

ధర.. దగా!

5వ పేజీ తరువాయి

వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీ మోహన్‌రెడ్డి, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి రైతులకు మద్దతుగా ధర్నాలో పాల్గొన్నారు. ప్రభుత్వం కొనుగోలు చేసే వరకు ఆందోళన ఆపేది లేదంటూ భీష్మించారు. మార్కెట్‌లో అమ్మకాలు చేసిన వారం రోజుల్లోగా బోనస్ అమౌంట్ రైతుల ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకుంటామని జేసీ బి.నవ్య స్పష్టమైన హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు.



రైతులకు మద్దతు తెలుపుతున్న వైసీపీ నాయకులు

బోనస్ డబ్బు వచ్చేనా..?

ఉల్లి క్వింటాకు ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.1,200లు. మార్కెట్‌లో వ్యాపారులు క్వింటా రూ.500కు కొనుగోలు చేస్తే. మిగిలిన రూ.700లు వ్యత్యాసం అమౌంట్ బోనస్ రూపంలో ప్రభుత్వం రైతుల ఖాతాలో జమ చేస్తుందని ఏపీ మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజరు రాజు తెలిపారు. బోనస్ డబ్బు వస్తుందా..? రైతులను వేధిస్తున్న ప్రశ్న. 2018లో కూడా ఇలాగే ధరలు పతనమైతే అప్పటి చంద్రబాబు ప్రభుత్వం కనీసం మద్దతు ధర రూ.700 నిర్ణయించింది. మార్కెట్‌లో అంతకంటే తక్కువ ధర పలికితే ఆ బ్యాలెన్స్ అమౌంట్ బోనస్‌గా ఇచ్చింది. తొలి విడతగా రూ.25 లక్షలు రైతుల ఖాతాలో జమ చేశారు. రెండో విడతలో అమ్మకాలపై కర్నూలు మార్కెట్లో పంట విక్రయించిన రైతులు జాబితా సేకరించి రూ.6.25 కోట్లు చెల్లించాలని ప్రభుత్వానికి నివేదిక పంపించారు. 2019 ఎన్నికల కోడ్ రావడంతో నిధులు ఆగిపోయాయి. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర అవుతున్నా ఆ దిశగా చర్యలు శూన్యం. దీంతో బోనస్‌పై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారానే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

> **క్వింటాలు రూ.250లకు కొనుగోలు చేశారు**
>
> 
>
> రెండు ఎకరాల్లో ఉల్లి సాగు చేశాను. ఎకరాకు రూ.లక్షకు పైగా పెట్టుబడి వచ్చింది. ఎకరం ఉల్లి పంట కోస్తే 130బస్తాలు దిగుబడి వచ్చింది. ప్రభుత్వం క్వింటా రూ.1,200కు కొనుగోలు చేస్తున్నారని మార్కెట్‌కు తీసుకొస్తే, ఏపీ మార్క్‌ఫెడ్ కొనుగోలు చేయలేదు. వ్యాపారులు క్వింటా రూ.250లకు కొనుగోలు చేశారు. ప్రభుత్వం మిగిలిన మొత్తం బోనస్ ఇస్తుందని అధికారులు తెలిపారు. ఎప్పుడు వస్తుందో తెలియదు.
>
> ● ఈరన్న, ఉల్లి రైతు, గువ్వలదొడ్డి గ్రామం, ఎమ్మిగనూరు మండలం

టమోటాది అదే పరిస్థితి

పత్తికొండ, ప్యాపిలి, బిల్లెకల్లు, ఆస్పరి టమోటా మార్కెట్‌లలో టమోటా దిగుబడులు అమ్మకాల కోసం రైతులు తీసుకొచ్చారు. ధరలు పతనం కావడంతో కిలో రూ.5-6లు కూడా గిట్టుబాటు కావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. శనివారం పత్తికొండ మార్కెట్‌లో 40 కిలోలు టమోటా రూ.300లు కలిపింది. కొంత ఊపిరి పీల్చుకున్నారు. మెజార్టీగా కిలో రూ.5లోపే అమ్ముడుబోయిందని రైతులు పేర్కొన్నారు.

జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన



తనిఖీ చేస్తున్న పోలీసులు

నంద్యాల టౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ప్రమాదాలను నివారించేలా నాలుగు సబ్ డివిజన్‌ల్లో రోడ్డు ప్రమాదాలపై, ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన శనివారం నిర్వహించారు. జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లు, వాహనదారులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చినట్లు తెలిపారు. మహిళల పట్ల మార్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. వాహనానికి తగిన పత్రాలు అన్ని సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు తప్పకుండా లైసెన్స్ కల్గి ఉండాలన్నారు. పరిమితికి మించి వేగంగా వెళ్లరాదని, మద్యం సేవించిన అటువంటి వారిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. మోటారు వాహన చట్టాలు అందరు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో జిల్లా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

నందికొట్కూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణకొట్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1975-76బ్యాచ్ చెందిన పూర్వ విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. పాఠశాలకు తమ వంతుగా ఆర్థిక సహాయంతో నిర్మించిన కళావేదికను ప్రారంభించారు. పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువు ఫణిరావు ఆయన సతీమణిలకు పాదపూజ చేసి సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కమలాకర్ రావు, పుండరీకాక్షాయ, మద్దూరు వెంకటరామిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముజాహిద్‌పాష పాల్గొన్నారు.

ఆశలు రేపుతున్న మిరప ధరలు



హాలహర్వి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మిరప ధరలు పతనమైన వేళ నష్టాలలో కూరుకుపోతున్న అన్నదాతకు ప్రస్తుతం ధరలు రైతులకు ఆశలు రేకెత్తిస్తున్నాయి. గత ఏడాది పూర్తి స్థాయిలో ధర పతనం కావడంతో ఈ సంవత్సరం రైతులు మిరప సాగుపై చాలామంది రైతులు విముఖత చూపారు. ఆలూరు నియోజకవర్గంలో ఎల్లెల్సీ, హెచ్చెల్సీ, హంద్రీ నీవా కాలువల కింద సాగు చేసుకున్న రైతులకు ప్రస్తుతం పెరిగిన ధరలు ఊరట ఇస్తున్నాయి. ధర లేక అమ్ముకోలేని రైతులు మార్కెట్‌లో అలాగే స్టాక్ ఉంచి వచ్చేశారు. ప్రస్తుతం తేజ రకం రూ.16 వేలు, సిజంటా రూ.20 వేలు, బ్యాడిగరకం రూ.25 వేలు ధరలు పెరగడంతో శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసుకున్న మిరపను రైతులు విక్రయిస్తున్నారు.



ఎస్ఈకి వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కల్లూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగుల దీర్ఘకా లిక సమస్యలు పరిష్కరించాలని ఏపీ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం కర్నూలు జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయంలో జేఏసీ చైర్మన్ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఈ ఎం.ఉమాపతికి వినతిపత్రం అందించారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారం కోసం ఈనెల 15 నుంచి 22వ తేదీ వరకు ర్యాలీలు, దీక్షలు, నిరసనలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మీకాంతరెడ్డి, ఎన్‌జీ.శంకర్, నాగశేషులు, పీవీ.రామరాజు, రవికుమార్, సయ్యద్ బాషా పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


మద్దిలేటి (ఫైల్)

వెల్దుర్తి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఓ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలో చోటుచేసుకున్నట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు. వివరాలు.. ఎస్.పేరాముల గ్రామానికి చెందిన ముంత మద్దిలేటి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తనకున్న రెండెకరాల పొలంతో పాటు మరో ఆరు ఎకరాలు కౌలుకు తీసుకున్నాడు. గతేడాది పత్తి, ఆముదం పంటలు వేసి తీవ్రంగా నష్టపోయాడు. సుమారు రూ.6లక్షలు అప్పులు మిగిలాయి. నాలుగు నెలల క్రితమే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. చికిత్స పొందుతూ ఆసుపత్రిలో కోలుకున్నాడు. తిరిగి వ్యవసాయం మీద నమ్మకంతో ఈసారి ఎనిమిది ఎకరాల్లో కంది పంట సాగుచేశాడు. దిగుబడులు రాని పరిస్థితి. అప్పుల వారి ఒత్తిడి పెరిగిపోవడంతో మనోవేదనకు గురయ్యాడు. ఏమిచేయాలో దిక్కుతోచక కుటుంబసభ్యులు శుక్రవారం ఊరికి వెళ్లగా, రాత్రి ఇంట్లో దూలానికి తాడుతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం ఉదయం స్థానికులు గమనించి కుటుంబసభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వెల్దుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు.

చికిత్స పొందుతూ రైతు..

రుద్రవరం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటకొండ గ్రామానికి చెందిన రైతు జంగిటి నారాయణ (47) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు శనివారం ఎస్ఐ మహ్మద్‌రఫీ తెలిపారు. వివరాలిలా.. గ్రామానికి చెందిన నారాయణ రెండేళ్ల నుంచి తనకున్న ఐదెకరాల పొలం, మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని మినుము, వరి, మొక్కజొన్న పంటను సాగు చేశాడు. పంటలు దిగుబడి సరిగా లేక నష్టపోయాడు. పెట్టుబడి కూడా రాకపోవడంతో రూ.20లక్షలు అప్పులయ్యాయి. అప్పుల బాధ తాళలేక ఆగస్టు 28న రసాయన మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. భార్య లక్ష్మీదేవి చూసి నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు..

మంత్రాలయం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలపల్లి గ్రామానికి చెందిన బోయ ఉపేంద్ర (21) అనే యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఉపేంద్ర ఈ నెల 1వ తేదీన అందరూ పొలం పనులకు వెళ్లిన సమయంలో ఇంట్లో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. తీవ్రంగా గాయాలతో ఉన్న ఉపేంద్రను కుటుంబ సభ్యులు ఆదోని, కర్నూలు, ఆసుపత్రిలో చికిత్సలు చేయించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఉపేంద్రకు తండ్రి ఈశ్వర్, తల్లి సుజాత ఉన్నారు. యువకుడి తండ్రి ఈశ్వర్ ఫిర్యాదు మేరకు మాధవరం పోలీసులు కేసు నమోదు చేసుకుని అక్కడే పోస్టుమార్టం నిర్వహించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయకుమార్ తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన మరో లారీ

- వ్యక్తి మృతి.. ముగ్గురికి తీవ్ర గాయాలు

శిరివెళ్ల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీని మరో లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటన కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిపై కానాలపల్లె మెట్ట సమీపంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ చిన్నపీరయ్య వివరాల ప్రకారం.. ఆగి ఉన్న లారీని మరో లారీ వెనుక నుంచి ఢీకొనడంతో మహానంది మండలం బొల్లవరం గ్రామానికి చెందిన పీటర్ (46) అనే వ్యక్తి దుర్మరణం చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మృతదేహాన్ని పంచనామ నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వృద్ధురాలి బలవన్మరణం

నంద్యాల టౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): అపార్ట్‌మెంట్‌పై నుంచి దూకి ఓ వృద్ధురాలు బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన నంద్యాల పట్టణంలోని చోటు చేసుకున్నట్లు మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ కంబగిరి రాముడు తెలిపారు. వివరాలు.. సాయిబాబా నగర్ నుంచి రైల్వేస్టేషన్‌కు పోయే దారిలో ఉన్న ఒక అపార్టుమెంట్‌లో ఉంటున్న సుబ్బమ్మ(70) అనారోగ్య సమస్యలతో సతమతమవుతోంది. ఐదేళ్ల క్రితం మోకాళ్లకు ఆపరేషన్ జరిగింది. ఇది జరిగిన కొంతకాలానికే మానసిక పరిస్థితి బాగాలేకపోవడంతో సైకాలజిస్టు వద్ద చికిత్స చేయిస్తున్నారు. శనివారం ఐదో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకుందన్నారు. అపార్టుమెంట్‌ను కూడా ఇటీవలే కొనుగోలు చేశారు. మృతురాలికి కొడుకు, కూతురు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల జీజీహెచ్‌కు తరలించారు. భర్త సుబ్బరాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య


గజ్జలి లింగన్న(ఫైల్)

కోసిగి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు రైలుకు కింద పడి బలవన్మరణానికి పాల్పడిన ఘటన కర్ణాటక రాష్ట్రం రాయచూరు రైల్వేస్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని అగసనూరు గ్రామానికి చెందిన కురువ గజ్జలి నరసప్ప, ఈరమ్మ దంపతుల ఐదో కుమారుడు గజ్జలి లింగన్న(32). కర్ణాటకలోని మాన్వి తాలుకా, అరివి గ్రామానికి చెందిన నాగమ్మతో లింగన్నకు వివాహమైంది. భార్యతో కలిసి అతడు బేల్దార్ పని చేస్తూ బెంగుళూరులో నివాసం ఉంటున్నారు. నెల క్రితం భార్య నాగమ్మ పుట్టింటికి వెళ్లిపోయింది. ఐదు రోజుల క్రితం లింగన్న భార్య ఊరికెళ్లి తన వెంట బెంగుళూరుకు రావాలని కోరాడు. ఇక్కడే పనిచేసుకుందామని భార్య చెప్పడంతో వీరిద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. దీంతో మనోవేదనకు గురైన లింగన్న శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో రాయచూరు రైల్వే స్టేషన్ సమీపంలో ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అంతకంటే గంట ముందు తన అన్నలకు, కుటుంబానికి ఫోన్‌చేసి 'రేపు నా మట్టికి రావాలని.. అంతకంటే ఇంకేమీ మాట్లాడవద్దని, ఇదే చివరి మాటలు అని చెప్పి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. కర్ణాటక రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి దారుణ హత్య

కోడుమూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని ఓ మద్యం దుకాణం దగ్గర మండలంలోని వెంకటగిరి గ్రామానికి చెందిన గిరి(23) అనే యువకుడి దారుణ హత్యకు గురయ్యాడు. వెంకటగిరికి చెందిన గిరి, మౌలాలి, ఉస్సేన్ అనే యువకులు మద్యం తాగేందుకు శనివారం సాయంత్రం మద్యం దుకాణానికి వెళ్లారు. అక్కడ మద్యం తీసుకొన్న వీరు వైన్స్ షాపు వెనక భాగంలో మద్యం తాగారు. తాగిన మైకంలో గిరితో మౌలాలి, ఉస్సేన్‌ల మధ్య మాటమాట పెరగడంతో వీరి మధ్య గొడవకు దారి తీసింది. ముందుగానే పథకం ప్రకారం తెచ్చు కొన్న కత్తితో గిరిపై దాడికి దిగి గొంతుకోయడంతో యుకువడు అక్కఇక్కడే మృతి చెందాడు. పోలీసులు చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. ఎస్ఐ డీవై స్వామి కేసే నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. వీరి మధ్య పాత కక్షలు ఉన్నాయా? లేక ఇతర కారణాలు ఏమైన ఉన్నాయా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.

ఉల్లి రైతుల ఆత్మహత్యాయత్నం

- వైరల్‌గా మారిన సెల్ఫీ వీడియో


చికిత్స పొందుతున్న వెంకటనాయుడు, కృష్ణ

కర్నూలు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సి.బెళగల్ మండలం పోలకల్ గ్రామంలో ఉల్లి రైతులు వెంకట నాయుడు, కృష్ణలు ఆత్మహత్యాయత్నం సెల్ఫీ వీడియో శనివారం వైరల్‌గా మారింది. ప్రస్తుతం వారు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకుంటున్నారు. వెంకటనాయుడు రెండెకరాల్లో ఉల్లి పంట వేస్తే 96 బస్తాలు, కృష్ణ రెండున్నర ఎకరాల్లో ఉల్లి సాగు చేస్తే 110 బస్తాల దిగుబడి వచ్చింది. వీరిద్దరు కూడా స్వయాన అన్నదమ్ముల పిల్లలు. వీరు వైసీపీ కార్యకర్తలని స్థానికులు పేర్కొంటున్నారు. శుక్రవారం పొలంలోనే ధర లేకపోవడంతో ఆత్మహత్య చేసుకుంటున్నామంటూ సెల్ఫీ వీడియో తీసి అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. రాత్రి అంబులెన్సులో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆ సెల్ఫీ వీడియో శనివారం వైరల్ అయింది. అయితే కూటమి ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాల్సేసేందుకే వైసీపీ నాయకులు కుట్రలో భాగంగా ఈ డ్రామాకు తెర తీశారనీ టీడీపీ ఆరోపిస్తోంది. దీనిపై విచారణ చేస్తున్నామని సి.బెళగల్ ఎస్ఐ పరమేష్ నాయక్ తెలిపారు. వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి, కోడుమూరు ఉద్యానవన శాఖ అధికారులు మదన్ మోహన్, శశికాంత్ రైతుల ఉల్లి పంటను పరిశీలించారు. వెంకట నాయుడు భార్య రంగమ్మను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో వెంకటనాయుడు, కృష్ణను వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి పరామర్శించారు.

ప్రభుత్వంపై వైసీపీ కుట్ర

- రైతుల కష్టాల పేరిట ఆత్మహత్యాయత్నం డ్రామా
- పోలకల్లు ఘటనపై 'ఎక్స్' వేదికగా స్పందించిన టీడీపీ

కర్నూలు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సి.బెళగల్ మండలంలోని పోలకల్లు గ్రామంలో ఉల్లి రైతుల కష్టాల పేరిట వైసీపీ కార్యకర్తలు ఆత్మహత్యాయత్నం డ్రామాకు తెర తీశారని టీడీపీ ఆరోపిస్తోంది. శనివారం రాత్రి ఎక్స్ వేదికగా ఈ ప్రకటన చేసింది. కూటమి ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాల్సేసేం దుకు కుట్రల్లో భాగంగా అన్నదాత కష్టాల పేరుతో ఆత్మహత్యా యత్న డ్రామా ఆడుతున్నారని పేర్కొంది. ఉల్లి ధరలు తగ్గాయం టూ వైసీపీ కార్యకర్తలతో ఆ పార్టీ నాయకులే ఈ డ్రామా ఆడించారని పేర్కొన్నారు. పండించిన ఉల్లి పంటను అమ్మకానికి మార్కెట్ కు తీసుకురాకుండానే గిట్టుబాటు ధర లేక పురుగు మందు తాగి చనిపోతామంటూ సెల్ఫీ వీడియో రికార్డు చేయడం ఆ పార్టీ నేతల దగాకోరు తనానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఖాళీ పురుగు మందు సీసాలో మద్యం కలుపుకుని ఆ మద్యాన్ని తాగి ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ సెల్ఫీ వీడియో తీశారనీ, ఈ సెల్ఫీ వీడియో డ్రామా ఆడిన ఇద్దరు వైసీపీ కార్యకర్తలుగా గుర్తించినట్లు పేర్కొన్నారు. శుక్రవారం జరిగిన ఈ ఘటన శనివారం వెలుగులోకి రావడంతో అధికారులు సమగ్ర విచారణ చేపట్టారు. దీని వెనుక ఎవరు ఉన్నారు?, వారి అసలు ఉద్దేశం ఏమిటీ అనేది అధికారులు పూర్తిగా ఆరా తీస్తున్నారని వివరించారు. ప్రస్తుతం వారికి ఎలాంటి అపాయం లేదని, ఎక్కువ మద్యం తీసుకోవడం వల్ల కొంత ఇబ్బందులు పడ్డారని డాక్టర్లు వివరించినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో డైరెక్టర్‌గా పని చేసిన వైసీపీ నాయకుని అనుచరులుగా గుర్తించామని, ఎలాంటి అనారోగ్య సమస్యలు లేకుండా ఆసుపత్రిలో ఉన్న ఫొటోలను అధికారులు విడుదల చేశారు.

గడ్డివాము దగ్ధం

- రైతును ఆదుకోవాలి: సీపీఐ


దగ్ధమైన గడ్డివామిని చూపుతున్న సీపీఐ నాయకులు

బేతంచెర్ల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబాపురం గ్రామంలో గడ్డివాము దగ్ధమైంది. ఈ ఘటనలో రైతు గోర్లగుట్ట రామచంద్రుడికి రూ. 3లక్షల ఆస్తినష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన రామచంద్రుడి తన పశువుల కోసం గ్రామ సమీపంలో పశుగ్రాసాన్ని నిల్వ చేశాడు. అయితే శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు దగ్ధమైంది. సీపీఐ మండల సహాయ కార్యదర్శి తిరుమలేష్, అంబాపురం గ్రామ శాఖ కార్యదర్శి నాగేశ్వరరావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్ బాధిత రైతును పరామర్శించారు.

బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సోమన్న, శ్రీరాములు, శంకర్, ప్రదీప్, బాలు, మధు, శ్రీమన్నారాయణ, రవి పాల్గొన్నారు.

పెచ్చులూడిన కార్యాలయం పైకప్పు

- ఎవరూ లేకపోవడంతో తప్పిన ప్రమాదం


మెట్లపై పడిన పెచ్చులు

ఆదోని టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ భవనం పై అంతస్థు కప్పు శనివారం పెచ్చులూడింది. అయితే ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం సంభవించలేదు. భవనం నిర్మించి కేవలం 17 సంవత్సరాలు అయిందని అప్పుడే పైకప్పు పెచ్చులూడటంపై విమర్శలు వస్తున్నాయి. కాగా మున్సిపల్ సమావేశ భవనం కూడా మొదటి అంతస్థులోనే ఉంది. సమావేశాల సమయంలో పెచ్చులూడింటే ఎలా? అని సిబ్బంది ఆందళన చెందుతున్నారు. మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

కుక్కల దాడి.. ఐదుగురికి గాయాలు

అవుకు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పలు గ్రామాల్లో కుక్కలు దాడి చేయడంతో ఐదుగురికి గాయాలయ్యాయి. అవుకు మండలం కాశీపురం గ్రామంలోని శాంతయ్య, కళావతి, జగదీష్, సుంకేసుల గ్రామంలోని బుల్లబ్బాయి, సంజామల మండలం ఆకుమల్ల గ్రామంలో దస్తగిరిని కుక్కలు కరిచాయి.

వీరిని కుటుంబసభ్యులు చికిత్స కోసం కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కళావతి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం నంద్యాలకు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

సీనియర్ రంగస్థల నటుడు వన్నెం బలరాం కన్నుమూత



కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన సీనియర్ రంగస్థల నటుడు, టీజీవీ కళాక్షేత్రం శాశ్వత సభ్యుడు వన్నెం బలరాం (72) శుక్రవారం సాయంత్రం కన్నుమూశారు. బుధవార పేట లోని నివాసంలో ఆయనకు ఆయాసం ఎక్కువ కావడంతో ఆసుపత్రికి తీసుకువెళుతుండగా, మార్గమధ్యలో తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గురువారం ఉదయం వన్నెం బలరాం పార్థీవ దేహాన్ని పలువురు రంగస్థల కళాకారులు, టీజీవీ కల్చరల్ అకాడమీ సంస్థ సభ్యులు సందర్శించి నివాళి అర్పించారు. టీజీవీ కల్చరల్ అకాడమీ అధ్యక్షుడు వీవీ రమణారెడ్డి మాట్లాడుతూ వన్నెం బలరాం మంచి గుర్తింపు తెచ్చుకున్న నటుడు అని, తొలి నంది అవార్డు సాధిం చిన ఘనత ఆయనకు దక్కుతుందని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ కేజీ గంగాధరరెడ్డి, అకాడమీ ప్రధాన కార్యదర్శి టి. రాజశేఖర్‌రావు, కళాకారులు చిన్ని కృష్ణ, సీహెచ్ శ్రీనివాస్, ఎంఆర్ రాధిక, పీజీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

టీజీవీ కళాక్షేత్రంలో వన్నెం బలరాంకు నివాళి...

వన్నెం బలరాం ఆకస్మిక మృతి దిగ్భ్రాంతి కలిగించిందని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు కళారత్న పత్తి ఓబులయ్య అన్నారు. శనివారం సాయంత్రం టీజీవీ కళాక్షేత్రంలో బలరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పత్తి ఓబులయ్య మాట్లాడుతూ లలిత కళాసమితిలో సభ్యునిగా 'నరనారాయణ' నాటకంలో తొలిసారిగా 1998లో తొలి నంది అవార్డు అందుకున్న ఘనత వన్నెం బలరాంకు దక్కుతుందని శ్లాఘిం చారు. ఓ మనిషీ నీకు జోహర్లు అనే సాంఘిక నాటకంలో ఉత్తమ హాస్య నటుడిగా 2013లో మరో నంది అవార్డు తీసుకున్నాడని, రెండు నంది అవార్డులు తీసుకున్న ఆయన మహారథి కర్ణ, పుటుక్కు జరజర దుబుక్కు మే, ప్రియాంక, పులిస్వారీ వంటి నాటకాల్లో నటించి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని అన్నారు. కళాక్షేత్రం ప్రతిని ధులు పి.రాజారత్నం, వాల్మీకి రాముడు, సంగా ఆంజనేయులు, జీవీ శ్రీనివాసరెడ్డి, మహమ్మద్ మియా పాల్గొన్నారు.

9న జిల్లా సీనియర్ టెన్నికాయిట్ జట్ల ఎంపిక

కర్నూలు స్పోర్ట్స్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9వ తేదీన నగరంలో జిల్లా సీనియర్ పురుషులు, మహిళల టెన్నికాయిట్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ కార్యదర్శి రమణ తెలిపారు. ఏ.క్యాంపులోని జోహరాపురం రోడ్డులోని నారాయణ ఇంగ్లీషు మీడియం పాఠశాల క్రీడా మైదానంలో ఎంపిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రాలతో పాటు ఎంపికలో పాల్గొనవచ్చన్నారు. వివరాల కోసం 9398401721ను సంప్రదించాలన్నారు.

వాహనం బోల్తా

- పదిమందికి గాయాలు


గాయపడిన భక్తులు


హెచ్.కొట్టాల గ్రామ సమీపంలో బోల్తాపడిన జీపు

ఆళ్లగడ్డ, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఎగువ అహోబిలం దారిలోని ఓం నమోనారాయణ మలుపు వద్ద శనివారం వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పదిమందికి గాయాలయ్యాయి. కడప జిల్లా కొండురు గ్రామానికి చెందిన పలు కుటుంబాల వారు దైవ దర్శనం కోసం అహోబిలం క్షేత్రానికి వచ్చారు. దిగువ అహోబిలంలో లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకొని ఎగువ అహోబిలం వెళ్తుండగా ఓం నమో నారాయణ మలుపు వద్ద వాహనం బోల్తా పడింది. దాంతో కొండూరు గ్రామానికి చెందిన ప్రతాప్‌రెడ్డి, షేక్ బాలంబీ, షేక్ కమాల్‌బీ, భరణి, వెంకటసుబ్బయ్యతో పాటు మరో ఐదుమందికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని సహాక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రతాప్‌రెడ్డి, భరణిలను మెరుగైన చికిత్స కోసం కడప ఆసుపత్రికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్.కొట్టాల గ్రామ సమీపంలో ...

బేతంచెర్ల: జీపు ముందు టైర్ల రాడ్ విరగడంతో పొలంలోకి దూసుకెళ్లి పల్టీ కొట్టగా ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన బేతంచెర్ల, డోన్ రహదారిలోని హెచ్.కొట్టాల గ్రామ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. వివరాలిలా.. కర్నూలు చెందిన ఐదుగురు జీపులో ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులోని మద్దిలేటి స్వామిని దర్శించుకున్నారు. తిరిగి స్వప్రాంతానికి వెళ్తుండగా జీపు ముందు టైర్ల రాడ్డు విరిగింది. దాంతో అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లి పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో ఐదుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఇంత పెద్ద ప్రమాదం జరిగినా స్వల్ప గాయాలతో బయటపడటంతో ఊపిరి పీల్చుకున్నారు.

జిరాక్స్ సెంటర్లు మూసివేయాలి

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఈ నెల 7 జరగనున్న ఫారెస్టు బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ పోస్టుల జరిగే పరీక్ష నేపథ్యంలో పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు బంద్ చేయాలని కార్మిక శాఖ ఉపకమిషనర్ కే.వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఉదయం 10.00 నుంచి మధ్యాహ్నం 12.00 వరకు, 3.00 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు జిరాక్స్‌ఇంటర్నెట్ సెంటర్లను మూసి వేయాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

కుటుంబ పరువు కోసమే హత్య

- వదినను చంపి మరిది అరెస్టు

నందికొట్కూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): కుటుంబ పరువు కోసమే ఓ మరిది తన వదినను చంపినట్లు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. వివరాలు.. పగిడ్యాల మండలం గణపురంలో లోక్ నాయక్ నివసిస్తున్నాడు. వదిన సుగాలి నాగమ్మ కొన్ని రోజుల నుంచి రైతుపల్లె గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తుంది. కుటుంబ పరువు పోతుందని, ప్రవర్తన మార్చుకోవాలని లోక్‌నాయక్ చెప్పారు. కానీ ఆమెలో మార్పు రాలేదు. దీంతో ఈనెల 4వ తేదీన హత్యకు పథకం వేశాడు. ముందుగానే ఇనుప రాడ్డును తీసుకొని నాగమ్మ ఇంటికి వెళ్లాడు. ఆమెతో వాగ్వాదం చేశాడు. ఫిర్యాదుదారుడు చంద్రనాయక్ లోక్‌నాయక్‌ను వారించేలోపే ఆమెను ఇనుప రాడ్‌తో తలపై బలంగా కొట్టాడు. దీంతో నాగమ్మ కిందపడి అక్కడికక్కడే మృతి చెందారు. సుగాలి లోకనాయక్‌పై ముచ్చుమర్రి పోలీస్‌స్టేషన్‌లో చంద్రనాయక్ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. శనివారం తూర్పు ప్రాతకోట గ్రామంలోని కాటమయ్య స్వామి గుడి వద్ద లోక్‌నాయక్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు పంపి రాడ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే 'పల్లెకు పోదాం'

డీఎం హెచ్‌వో డాక్టర్ శాంతికళ

కోడుమూరు రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం పల్లెకు పోదాం కార్యక్రమం చేపట్టిందని డీఎంహెచ్‌వో డాక్టర్ శాంతికళ అన్నారు. మండలంలోని లద్దగిరి గ్రామాన్ని డీఎంహెచ్‌వో శనివారం సందర్శించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో ప్రార్థనా సమావేశంలో విద్యార్థులకు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు. అనంతరం బీసీ హాస్టల్‌లో వసతులను ఆమె పరిశీలించారు. పాత్రలు శుభ్రంగా ఉంచుకుని ఆహారం తయారు చేయాలని, వ్యక్తిగత శుభ్రత పాటించాలని వంట మనుషులకు సూచించారు. అలాగే స్థానిక పీహెచ్‌సీని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. వైద్యసేవలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో


ఆర్ ఖానాపురంలో కుంటను పరిశీలిస్తున్న ఆర్డీవో సందీప్‌కుమార్

సొసైటీ చైర్మన్ పట్టి కృష్ణ, తహసీల్దార్ నాగరాజు, వైద్యాధికారి జయంతి, డీహెచ్‌ఈవో శ్రీనివాసయాదవ్, సీహెచ్‌వో శాంత పాల్గొన్నారు.

ఓర్వకల్లు: మండలంలోని ఓర్వకల్లు, హుడిచెర్ల, మీదివేముల గ్రామాల్లో శనివారం స్పెష్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. ఓర్వకల్లులో డ్వామా పీడీ వెంకటరమణయ్య, హుడిచెర్ల గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి, టీబీ కంట్రోల్ అధికారి ఎల్.భాస్కర్, మీదివేములలో జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఆఫీసర్ సుధీర్‌బాబు, ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దార్ విద్యాసాగర్, మండల స్థాయి అధికారులతో గ్రామాల్లో పర్యటించారు. గ్రామాల్లో పారి శుధ్యం, ఆసుపత్రిలో ప్రజలకు అందుతున్న వైద్యసేవలు, ఇళ్ల నిర్మాణాలు, రోడ్లు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సర్పంచులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

సి.బెళగల్: మండలంలోని పలుకుదొడ్డి, గుండ్రేవుల, సిబెళగల్ గ్రామాల్లో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక అధికారులు గ్రామాలలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహార్, డీఎల్డీవో రమణారెడ్డి, ఎంపీడీవో రాణెమ్మ, తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఏవో మల్లేష్‌కుమార్ పాల్గొన్నారు.

గూడూరు: మండలంలోని ఆర్ ఖానాపురం గ్రామాన్ని శనివారం ఆర్డీవో సందీప్‌కుమార్ సందర్శించారు. 'పల్లెకు పోదాం'లో భాగంగా గ్రామంలో మౌలిక సదుపాయాలను పరిశీలించారు. కుంటనీరే ప్రధాన వనరు అని శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు ఆర్డీవోను కోరారు. అనంతరం ఆయన గ్రామంలో కుంటను పరిశీలించారు. అలాగే బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను ఆర్డీవో తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్ నాయక్ పాల్గొన్నారు.


రికార్డును పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో శాంతికళ


హుడిచెర్లలో పర్యటిస్తున్న అధికారుల బృందం

టీజీ వెంకటేశ్‌ను కలిసిన కార్పొరేషన్ డైరెక్టర్


టీజీ వెంకటేశ్‌కు బొకే ఇస్తున్న నాగముని

కర్నూలు లీగల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపికైన మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్, న్యాయవాది జి.నాగముని శనివారం రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన కార్యాలయంలో టీజీని కలిసి నాగముని బొకేను అందించారు. తనకు ఈ పదవి రావడానికి కృషి చేసినందుకు నాగముని టీజీకి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు పుస్తకావిష్కరణ

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన సాహితీవేత్త కేపీఆర్ శర్మ రాసిన 'కవితా(వి)హారం పుస్తక ఆవిష్కరణ ఆదివారం ఉదయం 10 గంటలకు ఏర్పాటు చేసినట్లు పుస్తక సమీక్షకురాలు డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని వెంకటరమణ కాలనీలో రోడ్ నెం. 3లోగల సాయిరాఘవ రెసిడెన్సీ హాలులో ఈ కార్యక్రమం ఉంటుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమానికి బాలల కథా రచయిత డాక్టర్ ఎం.హరికిషన్ అధ్యక్షత వహిస్తారని, ముఖ్య అతిథిగా తెలుగు భాషా వికాస ఉద్యమం సంస్థ రాష్ట్ర కార్యదర్శి జేఎస్ఆర్‌కే శర్మ, ఆత్మీయ అతిథిగా విశ్రాంత ఆర్‌ఐవో కె.రంగనాథశర్మ, విశ్రాంత ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ కె.కల్యాణశాస్త్రి హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా ఆకాశవాణి వ్యాఖ్యాత కె.సునీత వ్యవహరిస్తారని తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

కర్నూలు రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి కింద (సీఎంఆర్ఎఫ్) మంజూరైన చెక్కును కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి బాధితుడు బోయ రామచంద్రుడుకి అందజేశారు. గూడూరుకు చెందిన బోయ రామచంద్రుడు గత కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. చికిత్స చేయించేందుకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో స్థానిక టీడీపీ నాయకుడు వెంకటేశ్వర్లు సహకారంతో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయ నిధి కింద దరఖాస్తు చేయించారు. అధికారులతో మాట్లాడి రామచంద్రుడుకి రూ.40,541లను ఎమ్మెల్యే మంజూరు చేయించారు. మంజూరైన చెక్కును బొగ్గుల దస్తగిరి ఆసుపత్రికి వెళ్లి బాధితుడు రామచంద్రుడికి అందజేశారు. ఈసందర్భంగా బాధితుడు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

విజేతకు అభినందన

కర్నూలు స్పోర్ట్స్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్‌లో కర్నూలు చెందిన హాసినీ బాయి కాంస్య పతకం సాధించింది. శనివారం సాయంత్రం స్థానిక డీఎస్ఏ అవుట్‌డోర్ స్టేడియం హాలులో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు పాల్గొని హాసిని బాయికి పతకంతోపాటు బొకే అందజేసి అభినందించారు. ఈ నెల 25 నుంచి 27 తేదీల్లో హర్యానా రాష్ట్రంలోని కురుక్షేత్ర యూని వర్సిటీలో జరిగిన జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్‌లో కుమారి హాసిని బాయి క్యాడెట్ విభాగంలో మూడో స్థానం సాధించి కాంస్య పతకం దక్కించుకుందని తెలిపారు.

నేడు ఉపాధ్యాయులకు సత్కారం

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం ఉదయం 10 గంటలకు సాహితీ, కళారంగాలకు చెందిన ఉపాధ్యాయులకు సత్కార కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు కళారత్న పత్తి ఓబులయ్య, కార్యదర్శి సి.యాగంటీశ్వరప్ప, కార్యక్రమ కన్వీనర్ ఎస్ మహమ్మద్ మియా తెలిపారు. ఎంపిక చేసిన 15 మంది ఉపాధ్యాయులకు జ్ఞాపిక, శాలువ, పూలదండలతో సత్కరిస్తున్నట్లు వారు తెలిపారు.

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక మాధవ నగర్‌లోని నారాయణ పాఠశాలలో ఏజీఎం అన్వర్‌బాషా ఆధ్వర్యంలో గ్రాండ్ పేరెంట్స్ డేను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రిన్సిపాల్ మహ్మద్ ఆల్తాఫ్ హాజరై ప్రసంగించారు. భారతదేశ సంస్కృతి సంప్రదాయాలు రాబోవు తరాలకు తీపి గుర్తుగా తాతలు, ముత్తాతలు నిలుస్తారన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు తాతయ్య, అమ్మమ్మలు వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. వైస్ ప్రిన్సిపాల్ రాధ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

24 గంటలు వైద్యసేవలు అందించాలి

కోడుమూరు రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని లద్దగిరి పీహెచ్‌సీలో 24 గంటలు వైద్యసేవలందించాలని గ్రామస్థులు డీఎంహెచ్‌వో డాక్టర్ శాంతికళకు వినతిపత్రం అందించారు. శనివారం పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ వద్ద ప్రజలు కలిసి విన్నవించారు. రాత్రి సమయంలో ఏదైనా అత్యవసర వైద్యసేవలకు వెల్దుర్తి, కర్నూలు వెళ్లాల్సి వస్తుందన్నారు.

యూరియా బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తున్న కూటమి నేతలు: కాటసాని


రైతు పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి నాయకులు యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారని నంద్యాల జిల్లా వైసీపీ అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆరోపించారు. శనివారం నగరంలోని తన స్వగృహంలో కార్పొరేటర్లు, వైసీపీ అనుబంధ విభాగాల నాయకులతో కలిసి ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా కాటసాని మాట్లాడుతూ ఒక పక్క రైతులు యూరియా కోసం భారులు తీరి కష్టపడుతుంటే వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, సీఎం చంద్ర బాబు రైతు సమస్యలు పరిష్కరించడంలో ఘోరంగా విఫలం అయ్యారని ఆరోపించారు. ఉల్లి, పత్తి, టమోటా, వరి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఈనెల 9న చేపట్టే రైతుపోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన రైతులు, ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఎస్.రేణుక, కల్లూరు ఎంపీపీ బి.శారద, వైసీపీ మండల కన్వీనర్ ఎద్దుల రామకృష్ణారెడ్డి, పాణ్యం వైసీపీ రైతు విభాగం అధ్యక్షుడు కెవీ.రమణారెడ్డి, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి


సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఐఎస్ఏ నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎ.నాగరాజు, జిల్లా కార్యదర్శి ఎస్.నాగార్జున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఏ ఆధ్వర్యంలో శనివారం స్థానిక సంక్షేమ భవన్ ఎదుట విద్యార్థులు ఆందోళన నిర్వహించారు. అనంతరం సోషల్ వెల్ఫేర్ సూప రింటెండెంట్ మనోహర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి చదువుకోవడానికి వచ్చే పేద విద్యార్థులకు హాస్టల్‌లో కనీస వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫల మైందని విమర్శించారు. అరకొర నిధులు కేటాయిస్తుండటంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. నిత్యావసర ధరలు పెరిగినా మార్కెట్‌లో పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచకపోవడం శోచనీయమన్నారు. ఒక్కో విద్యార్థికి రూ.3వేలు మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న వాటికి సొంత భవనాలు నిర్మించాలని, వార్డెన్, కమాటి, వాచ్‌మెన్ తదితర పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఏ నాయకులు అశోక్, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి


రక్త పరీక్షలు చేయించుకుంటున్న ఎంపీ నాగరాజు

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు కోరారు. నగరంలోని ఎన్ఆర్ పేటలో రహ్మతీయ ఫౌండేషన్, కర్నూలు మెడికవర్ హాస్పిటల్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రహ్మతీయ ఫౌండేషన్ వ్యవ స్థాపకులు ఇర్షాద్ బాషా పాల్గొన్నారు.

సమాజ సేవే లక్ష్యంగా మోక్షజ్ఞ సేన

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): సమాజ సేవే లక్ష్యంగా మోక్షజ్ఞ అభిమానులు పనిచేస్తారని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్. మోతిలాల్ అన్నారు. శనివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో నందమూరి మోక్షజ్ఞ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. మోతిలాల్ మాట్లాడుతూ నందమూరి మోక్షజ్ఞ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో క్యాన్సర్, తలసేమియా చిన్నారుల కోసం ప్రతి నెల రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నంద్యాల నాగేంద్ర కుమార్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సత్రం రామకృష్ణుడు, రమేష్‌రెడ్డి, ఉదయ్ ప్రతాప్, నగసూరి, చిన్న, నందమూరి శ్రీను, మధు పాల్గొన్నారు.

బెల్టు షాపులపై దాడులు

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): బెల్టు షాపులు నిర్వహిస్తున్న స్థావరాలపై దాడులు జరిపి మొత్తం 45 మద్యం బాటిళ్లు సీజ్ చేశామని ఎక్సైజ్ చంద్రహాస్ తెలిపారు. శనివారం సాయంత్రం స్పెషల్ ఫోర్స్ సీఐ రాజేంద్రప్రసాద్‌తో కలిసి దిగువపాడు గ్రామానికి చెందిన రెడ్డిపోగు ప్రసాద్ వద్ద 15 మద్యం బాటిళ్లు, కేతవరం గ్రామానికి చెందిన కురువ మదుబాబు వద్ద 12 మద్యం బాటిళ్లు, లక్ష్మీపురం గ్రామానికి చెందిన శేఖర్ వద్ద 10, మద్యం బాటిళ్లు, బోయ రామగిడ్డయ్య వద్ద 8 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని వీరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో కర్నూలు స్టేషన్ సబ్ ఇన్స్‌పెక్టర్లు కే.నవీన్‌బాబు, రెహానా బేగం, డీటీఎఫ్ సబ్ ఇన్స్‌పెక్టర్ ఇంద్ర కిరణ్ తేజ, సిబ్బంది ఈరన్న, చంద్రపాల్, రాజు, రామలింగయ్య పాల్గొన్నారు

నూతన కార్యవర్గం ఎన్నిక

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): కర్నూలు రెవెన్యూ డివిజనల్ ఏపీఆర్ఎస్ఏ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కర్నూలు డివిజన్ జాయింట్ సెక్రటరీ సందీప్ నాయక్, అసోసియేట్ ప్రెసిడెంటు సతీష్, కోశాధికారి విష్ణుప్రసాద్, వైస్ ప్రెసిడెంటు రామలక్ష్మి, డిస్ట్రిక్ట్ కౌన్సిల్ మెంబర్ తరుణ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి, ఉద్యోగుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు వి.రామాంజనేయులు, కార్యదర్శి ఐ.వేణుగోపాలరావు, సభ్యులు జాకీర్ హుశేన్, కృష్ణమూర్తి, అబ్దుల్ రజాక్, సందీప్ నాయక్, వెంకట సునీల్, కోనేరు రంగారావు, కుమారస్వామి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

సి.బెళగల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని శాస్త్రవేత్త రంగారెడ్డి రైతులకు సూచించారు. శనివారం మండల వ్యవసాయ కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఏవో మల్లేష్ కుమార్, ఎంపీఈవోలు, రైతులు ఉన్నారు.


మాట్లాడుతున్న శాస్త్రవేత్త రంగారెడ్డి

ఘనంగా గౌరు జనార్దన్‌రెడ్డి జన్మదిన వేడుకలు


వేడుకల్లో పాల్గొన్న గౌరు యూత్ ఫోర్స్

కల్లూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పాణ్యం నియోజకవర్గం యువ నాయకుడు గౌరు జనార్దన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గౌరు యూత్‌ఫోర్స్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో యశ్వంత్‌రెడ్డి, కట్ట వెంకటరెడ్డి, మురళిరెడ్డి, ఈశ్వర్ నాయక్, మోహన్‌గౌడ్, చిన్నమారెన్న, సయ్యద్ ఇబ్రహీం, అశోక్ నాయక్, రాఘవేంద్ర, శేఖర్, రమణ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

సి.బెళగల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని మండల ప్రత్యేక అధికారి రమణారెడ్డి ఎస్సీ హాస్టల్ వార్డెన్‌ను ఆదేశించారు. శనివారం సి.బెళగల్‌లోని ఎస్సీ, బీసీ హాస్టళ్లను ఆయన తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంఈవో జ్యోతి, ఎంపీడీవో రాణెమ్మ, ఎస్సీ హాస్టల్ వార్డెన్ భాస్కర్ ఉన్నారు.

ఉల్లి రైతులను ఆదుకోవాలి

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉల్లి రైతులను ప్రభుత్వం ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. సి.బెళగల్ మండలం పోలకల్ గ్రామానికి చెందిన ఉల్లి రైతు వెంకటేష్ నాయుడు నష్టాలతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం దారుణమన్నారు.

● ఉల్లి రైతులను ఆదుకుంటామని కూటమి ప్రభుత్వం ప్రకటించిందని, అయితే.. కనీసం వారం రోజులు కూడా పూర్తి కాకముందే మార్క్‌ఫెడ్ ద్వారా రైతుల నుంచి ఉల్లి కొనుగోళ్లను నిలిపివేయడం దారుణమని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం, జిల్లా కార్యదర్శి తిప్పన్నగౌడు అన్నారు. వ్యాపారులు నాణ్యత లేని ఉల్లిని కొనుగోలు చేయకపోతే వారి పరిస్థితి ఏమిటని ప్రభుత్వం గుర్తించకపోవడం దారుణమన్నారు.

పాలకొలనులో వైద్య శిబిరం

ఓర్వకల్లు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలకొలను గ్రామంలో కర్నూలు అమీలియో హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ చదువుల సుజాతమ్మ, సింగిల్ విండో అధ్యక్షుడు సీఎన్ సుధాకర్ రెడ్డి ప్రారంభించారు. ఈశిబిరంలో కంటి శుక్లం, గుండె జబ్బులు, షుగర్, బీపీ తదితర వ్యాధులకు వైద్యులు చేశారు. డైరెక్టర్ రాఘవేంద్ర, వైద్యులు రమాదేవి, శైలజ హాజరయ్యారు. ఎంపీటీసీ శేషమ్మ, వీఆర్వో వెంకట్రావు, రవికుమార్, ప్రజలు పాల్గొన్నారు.

నేడు ఆలయాల మూసివేత

కోడుమూరు రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోరంట్లలో ప్రసిద్ధ లక్ష్మీమాధవస్వామి, వీరభద్రస్వామి, రామేశ్వర స్వామి ఆలయాలను చంద్రగ్రహణం కారణంగా ఆదివారం మూసివేయనున్నట్లు ఈవో గుర్రెడ్డి తెలిపారు. ఈవో మాట్లాడుతూ రాత్రి 9.57 గంటల నుంచి తెల్లవారుజామున 1.26 వరకు చంద్రగ్రహణం ఉంటుందని, సాయంత్రం 4 గంటలకు ఆలయాలు మూసివేయనున్నట్లు తెలిపారు. తిరిగి సోమవారం వేకువన ఆలయశుద్ధి, పుణ్యాహవాచనం, గ్రహణశాంతి, అభిషేకం అనంతరం ఉదయం 6 గంటల నుంచి భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు.

ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో యోగా శిక్షణ తరగతులు


బ్రోచర్లను విడుదల చేస్తున్న రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ గోవిందరెడ్డి, ఇషా సెంటర్ కో-ఆర్డినేటర్ సుధీర్

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కర్నూలులోని ఎస్వీ కాంప్లెక్స్ హాలులో ఈ నెల 10 నుంచి 16వ తేదీ వరకు యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న ఇషా ఫౌండేషన్ సెంటర్ కో-ఆర్డినేటర్ సుధీర్ తెలిపారు. శనివారం నగరంలోని ఓమిని హాస్పిటల్‌లో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డితో కలిసి ఆయన శిక్షణ తరగతుల బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ నెల 10 నుంచి 16వ తేదీ వరకు రోజూ ఉదయం, సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు ఆదివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. 10వ తేదీ ఉదయం, సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకు ఉచిత పరిచయ కార్యక్రమం ఉంటుందని దీనికి అందరూ ఆహ్వానితులేనని ఆయన తెలిపారు. వివరాలకు 9663655003, 8499980150, 8019832238 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

క్విజ్, జాతీయ బృంద గాన పోటీలు ప్రారంభం

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): భారత్ వికాస్ పరిషత్ తుంగభద్ర హంద్రీశాఖల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం విజయదుర్గ డిగ్రీ కళాశాలలో క్విజ్, జాతీయ బృంద గాన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల ప్రారంభ కార్యక్రమాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు సబ్ ఇన్స్‌పెక్టర్ పవన్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి హాజరై విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో బాలసుబ్రహ్మణ్యం, రాఘవేంద్ర ప్రసాద్, కొట్టె చెన్నయ్య, లయన్ డా.రాయపాటి శ్రీనివాస్, మురళీకృష్ణ, హరి కృష్ణ, శైలేంద్ర సతీష్, కోదండ రామయ్య పాల్గొన్నారు.

నేడు నేత్రదానంపై అవగాహన ర్యాలీ

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని జిల్లా అంధత్వ నివారణ సంస్థ, సుశీల నేత్రాల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సుశీల నేత్రాలయ మెడికల్ డైరెక్టర్ డా.పి.సుధాక ర్‌రావు విలేకరులకు తెలిపారు. ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు నగరంలోని కలెక్టరేట్ నుంచి రాజ్‌విహార్ వరకు వంద మంది విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ కార్యదర్శి డా.సంధ్యారెడ్డి, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డా.కేజీ గోవిందరెడ్డి, కేవీ సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత డా.కేవీ సుబ్బారెడ్డి, సుశీల నేత్రాలయ కంటి వైద్యులు పాల్గొంటారని తెలిపారు.

'ఎరువుల సరఫరాలో ప్రభుత్వం విఫలం'

ఓర్వకల్లు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రైతులకు ఎరువులు అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని కర్నూలు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి విమర్శించారు. శనివారం మండలంలోని పున్నమి రెస్టారెంటు ప్రాంగణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రభాకర్‌రెడ్డితోపాటు జడ్పీటీసీ సభ్యుడు రంగనాథగౌడు, ఎంపీపీ తిప్పన్నలు మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యంతోనే యూరియా కొరత ఏర్పడిందని, దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కాంప్లెక్స్ ఎరువులు కొంటేనే బస్తా యూరియా ఇస్తామంటూ నిబంధనలు పెట్టడం సరికాదన్నారు. అనంతరం రైతు పోరు బాట పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు హరినాథ్ రెడ్డి, వెంగన్న, పాల మధు, నాగతిరుపాలు, శివకృష్ణారెడ్డి, శేఖర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, ఉస్మాన్ బాషా, సుధాకర్ రెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

'రైతు సమస్యలను పరిష్కరించని ప్రభుత్వం'

కల్లూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రైతు సమస్యలను ప్రభుత్వం పరిష్కరించడం లేదని పాణ్యం వైసీపీ రైతువిభాగం అధ్యక్షుడు కళ్లా వెంకటరమణారెడ్డి విమర్శించారు. శనివారం కృష్ణానరగ్ లోని వైసీపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు ఎద్దుల రామకృష్ణారెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్రంలో యూరి యా దొరక్క రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. ఈనెల 9న నంద్యాల జిల్లాలో చేపట్టనున్న రైతుపోరు కార్యక్రమాన్ని విజ యవంతం చేయాలని పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, శివశంకర్‌రెడ్డి, కేశవరెడ్డి, సత్యంరెడ్డి, పర్ల సుంకన్న పాల్గొన్నారు.

ఉల్లి రైతులకు పరామర్శ

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉల్లి రైతులు కృష్ణ, వెంకటనాయుడులను శనివారం సాయంత్రం సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు పరామర్శించారు. సి.బెళగల్ మండలం పోలకల్ గ్రామానికి చెందిన ఈ ఇద్దరు ఉల్లి రైతులు పురుగుల మందు తాగి శుక్రవారం రాత్రి క్యాజు వాల్టీకి వచ్చారు. ప్రాథమిక చికిత్స అందించి ఈ ఇద్దరు రైతులను ట్రామ కేర్‌లో ఉన్న మేల్ మెడికల్-5కు తరలించి చికిత్స అందిస్తున్నారు. సీఎస్ఆర్ఎంవో డా.టీసీహెచ్ వెంకటరమణ ఉన్నారు.

● పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి కర్నూలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఉల్లి రైతులను కర్నూలు జిల్లా వైసీపీ అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి శనివారం పరామర్శించారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక మాధవనగర్ లోని రవీంద్ర ఇంగ్లీషు మీడియం పాఠశాల, స్థానిక రెవెన్యూ కాలనీలోని రవీంద్ర టాలెంట్ స్కూల్‌లో కరస్పాండెంట్ పీబీవీ సుబ్బయ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


విధేయతకు గుర్తింపు

● కర్నూలు 29వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి శ్రీనివాసరావు

● రాష్ట్ర బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపిక



పాణ్యం/ కల్లూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీకి చేసిన సేవలను పార్టీ అధిష్ఠానం గుర్తించిందని కర్నూలు 29వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి శిండిగేరి శ్రీనివాసరావు అన్నారు. తాజాగా రాష్ట్ర బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా శ్రీని వాసరావును పాణ్యం నియోజకవర్గం నుంచి ఎంపిక చేశారు. శనివారం మాధవనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డిని ఆయన మర్యాదపూర్వంగా కలిశారు. పార్టీ పెద్దలకు, గౌరు కుటుంబానికి, మల్లెల రాజశేఖర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. శ్రీనివాసరావు విద్యార్థి దశనుంచి కమ్యూనిస్టు భావాలతో పలు ఉద్యమాలు చేపట్టారు. గోనెగండ్ల మండలం, పెద్దమర్రి వీడు గ్రామానికి చెందిన ఈయనకు భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. జిల్లా ఫార్మా మేనేజరు యూనియన్ వ్యవస్థాపక సభ్యులుగా, చిత్తూరు జిల్లా మెడికల్ రిప్రజెంటేటివ్ యూని యన్ అధ్యక్షుడిగా విధులు నిర్వహించారు. గౌరు కుటుంబంతో ఉన్న సత్సంబంధాలతో టీడీపీలో చేరిపార్టీకి సేవలందించారు. 2021లో కార్పొరేటర్‌గా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. 15 యేళ్లుగా బ్రాహ్మణ సామాజికవర్గం ఓట్లు టీడీపీకి వేయించడంలో తన వంతు కృషి చేశారు. సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


ఎమ్మెల్యే గౌరు చరిత దంపతులను సన్మానిస్తున్న శ్రీనివాసరావు

సమస్యలు పరిష్కరించండి

ఆస్పరి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రహదారులు, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని ప్రత్యేకాధికారులను గ్రామాల ప్రజలు విన్నవించారు. శనివారం ఆస్పరి, చిన్నహోతూరు, డి.కోటకొండ గ్రామాల్లో పల్లెకు పోదాం నిర్వహించారు. ప్రత్యేకాధికారులు పాండురంగయ్య, మునికన్నన్, మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. ఆస్పరి, చిన్నహోతూరులో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, డి.కోటకొండ గ్రామం నుంచి కారుమంచి వరకు రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు విన్నవించారు. తహసీల్దార్ రామేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ గీతావాణి, సర్పంచ్ మూలింటి రాధమ్మ, ఎంఈఓ రాజేంద్రప్రసాద్, కార్యదర్శులు సురేష్, జములానాయక్, మహానందిస్వామి పాల్గొన్నారు.

18 నుంచి ఉరుసు

ఆలూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎల్లార్తి హజరత్ షేక్షావలి సామెబ్ హజరత్ సాషావలి సామెబ్ 363వ ఉరుసు ఈ నెల 18 నుంచి ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. శనివారం ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో ఎమ్మెల్యే విరుపాక్షి పోస్టర్లను విడుదల చేశారు. ఈ నెల 18న ఉరుసు, 19న ఉరుసు, 20న జియారత్ ఉంటాయన్నారు. వైసీపీ కన్వీనర్ మల్లికార్జున, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.కె.గిరి, కో కన్వీనర్ వీరేష్, ఎస్సీ సెల్ తాలూకా అధ్యక్షులు వీరేష్, నాగేంద్ర పాల్గొన్నారు.

ఉల్లి పంట ఎర్రగా మారుతోంది

మద్దికెర, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అధిక తేమతో ఉల్లి పంట దెబ్బతింటుందని, సూచనలు ఇవ్వాలని రైతులు కోరారు. శనివారం కార్యాలయంలో ఏవో రవికి విన్నవిచడంతో నానో యూరియా ఎకరాకు అరలీటరుకు 120 లీటర్ల నీరు పోసి ఉల్లి కి పిచికారీ చేస్తే ప్రయోజనం ఉంటుందని తెలిపారు. రైతులు పులిశేఖర్, హనుమంతు, వ్యవసాయ సిబ్బంది ఆనంద్, ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

- చిన్నగోనేహాల్ 'పల్లెకు పోదాం'లో సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్



సమస్యలను తెలుసుకుంటున్న సబ్‌కలెక్టర్



పత్తికొండలో విచారణ చేస్తున్న ఆర్డీవో భరత్‌నాయక్

ఆదోని, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలు పరిష్కరిస్తామని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. మండలంలోని చిన్నగొనేహాల్ గ్రామంలో శనివారం 'పల్లెకు పోదాం'లో సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ పాల్గొన్నారు. గ్రామంలోని పాఠశాల, ఓహెచ్ఎస్ఆర్, కాలనీలు, శ్మశాన వాటిక, రోడ్లు, నీటి సరఫరా వ్యవస్థ, ఇళ్ల నిర్మాణాలు అంశాలను తనిఖీ చేశారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

నిబంధనల మేరకు పనిచేయాలి : ఆర్డీవో

పత్తికొండ: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ నిబంధనల మేరకే పనిచేయాలని ప్రత్యేకాధికారి, ఆర్డీవో భరత్‌నాయక్ సూచించారు. శనివారం 'పల్లెకుపోదాం'లో భాగంగా పత్తికొండ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్వాడీ, ఆరోగ్య కేంద్రాలు, వసతి గృహాలను తనిఖీ చేశారు. విద్యార్థుల భోజనం మెనూ, తాగునీటిని పరిశీలించారు. బస్సుల కండీషన్ రికార్డుల వివారలను తెలుసుకున్నారు. డిప్యూటీ ఎంపీడీవో నరసింహులు, పీఆర్ఏఈ వెంకటేష్, సిబ్బంది ఉన్నారు.

పనిచేస్తేనే సమస్యల పరిష్కారం

తుగ్గలి: అధికారులు పనిచేస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని ప్రత్యేకాధికారి సుధాకర్ రెడ్డి సూచించారు. శనివారం జొన్నగిరిలో సమస్యలను తెలుసుకున్నారు. మురుగును రోడ్డుపైకి వదలవద్దని గ్రామస్థులకు సూచించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లు, సచివాలయాలను, హాస్టళ్లను తనిఖీ చేశారు. తహసీల్దార్ రవి, ఎంపీడీవో విశ్వమోహన్, డిప్యూటీ ఎంపీడీవో శ్రీహరి, ఎంఈవో రమావెంకటేశ్‌గౌడు, ఏవో సురేష్ సర్పంచ్ ఓబులేసు, కార్యదర్శి నారాయణ స్వామి, ఎంపీటీసీ ఎర్రనాగప్ప ఉన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి

మద్దికెర: ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలని డీఎల్‌పీవో రామచంద్రారెడ్డి సూచించారు. శనివారం మండలంలోని మద్దికెర, బొజ్జనాయునిపేట గ్రామాల్లో 'పల్లెకు పోదాం' నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బా, ఆదర్శ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు.

ప్రహరీ నిర్మించాలి

మద్దికెర, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాలుర వసతి గృహానికి ప్రహరీ నిర్మించాలని వార్డెన్ శ్రీనివాసులు కోరారు. శనివారం డీఎల్‌పీవో రామచంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శివకుమార్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. వసతి గృహంలో 200 మంది విద్యార్థులు ఉన్నారని, ప్రహరీ లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. అలాగే మురుగు బయటకు వెళ్లేలా చూడాలని కోరారు. స్పందించిన అధికారులు ఇంజనీర్ల ద్వారా ద్వారా ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు.

అదుపు తప్పిన బైక్.. యువకుడికి గాయాలు

దేవనకొండ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని టర్నింగ్ రహదారిలో పశువులు అడ్డురావడంతో బైక్ అదుపు తప్పి యువకుడికి గాయాలయ్యాయి. వివరాల మేరకు.. నందికొట్కూరుకి చెందిన యం.రాజు గ్రానైట్ బండలు పరిచే పనికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. దేవనకొండ క్రాస్ వద్ద పశువులు అడ్డుగా రావడంతో ప్రమాదం చోటుచేసుకొంది. బాధితుడిని అంబులెన్స్‌లో కర్నూలుకు తరలించారు.

ఉన్నత పాఠశాలకు స్థలం కేటాయించండి

ఆలూరు(చిప్పగిరి), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరడోణ గ్రామంలో ఉన్నత పాఠశాలకు స్థలం కేటాయించాలని గ్రామస్థులు కోరారు. శనివారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రవీంద్రబాబు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి, సమస్యలను తెలుసుకున్నారు. ఆలూరు బ్రాంచ్ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ నగరడోన కిష్టప్ప తమ గ్రామంలో ఉన్నత పాఠశాలకు గదులు లేవని, గ్రామ శివారులోని ప్రభుత్వ స్థలలాన్ని కేటాయించాలని కోరారు. ఎంపీడీవో అల్లాబకాష్ పాల్గొన్నారు.



అధికారిని కోరుతున్న నగరడోన కిష్టప్ప

గ్రామ సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

దేవనకొండ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామల్లోని సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని మండల ప్రత్యేక అధికారులు వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, ప్రకాష్ తెలిపారు. 'పల్లెకుపోదాం'లో భాగంగా మండలంలోని తెర్నేకల్, పాలకుర్తి, పొట్లపాడు గ్రామాలలో జిల్లా అధికారులు పర్యటించారు. పొట్లపాడులో హంద్రీనదిపై వంతెన నిర్మించాలని గ్రామస్తులు కోరారు. తహసీల్దార్ రామాంజినేయులు, ఎంపీడీవో జ్యోతి, డీప్యూటీ ఎంపీడీవో గోపాల్, సర్పంచులు అరుణ్‌కుమార్, సుధారాణి, నాయకులు రుద్ర, చిన్నవెంకప్ప, లుముంబా ఉన్నారు.



పొట్లపాడు గ్రామస్థులతో ప్రత్యేకాధికారి

కాంగ్రెస్ పోరాటంతో రీ సర్వే

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ పోరాట ఫలితంగానే ప్రభుత్వ భూముల ఆక్రమణపై రీ సర్వే చేస్తున్నట్లు ఆ పార్టీ ఇన్‌చార్జి క్రాంతినాయుడు అన్నారు. శనివారం పట్టణంలోని సర్వే నెంబర్లు 95, 710లలో వీఆర్వో సాగర్‌రెడ్డి, సర్వేయర్ యుగంధర్‌తో పాటు పార్టీ నాయకులు ఖాసీంవలీ, మైనార్టీ నాయకులు నూర్ అహ్మద్‌లు సర్వేలో పాల్గొన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై తాను జిల్లా ఉన్నతాధికారులకు పలు దఫాలుగా ఫిర్యాదులు చేశానన్నారు. స్పందించిన అధికారులు రీ సర్వే చేయడం శుభపరిణామమన్నారు. ఆక్రమణలు, కబ్జాలపై కాంగ్రెస్ పార్టీ తరపున హైకోర్టులో రిట్ పిటిషన్ వేస్తామన్నారు.



రీ సర్వే చేస్తున్న అధికారులు

హడలెత్తించిన అధికారులు

ఆలూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం 'పల్లెకు పోదాం' నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీలు చేశారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అజయ్‌కుమార్ మాదక ద్రవ్యాల నియంత్రణాధికారి రమాదేవి, పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, డీటీ విజయ్‌కుమార్, ఎంపీడీవో మద్దిలేటిస్వామి, ఎంఈఓలు కోమలదేవి, చిరంజీవిరెడ్డి బృందాలుగా విడిపోయి తనిఖీలు చేశారు.



బాలుర ఉన్నత పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

వెల్దుర్తి టౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో అసౌకర్యాలపై స్పెషల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం 'పల్లెకు పోదాం' కార్యక్రమంలో భాగంగా ఆయన పాఠశాలను తనిఖీ చేశారు. హెచ్ఎంతో పాటు ఏడుగురు ఉపాధ్యాయులు లీవ్‌లో ఉండటాన్ని గమనించి, ఇన్‌చార్జి హెచ్ఎం లక్ష్మిని ప్రశ్నించారు. పాఠశాల పరిస్థితులను గమనించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతనం ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించారు. మెయిన్ బజారులో వృథాగా ఉన్న వాటర్ ట్యాంకును ఉపయోగంలోకి తీసుకురావాలని ఈవో లక్ష్మినాథ్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడ్, తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మ ఉన్నారు.

గుంతదారి



పట్టణంలోని ఆదోని-మంత్రాలయం ప్రధాన రహదారిలో నూతన వంతెన కింద గుంత ప్రమాదకరంగా ఉంది. బళ్లారి నుంచి మంత్రాలయం, రాయచూరు పట్టణాల వాహనాలు ఈ గుంతలో నుంచే వెళ్లాల్సివస్తోంది. వర్షపునీరు నిలవడంతో ప్రమాదం చోటుచేసుకునే అవకాశముంది. అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.- **ఆదోని**

పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్యాంబాబు

పత్తికొండ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరమని ఎమ్మెల్యే శ్యాం బాబు అన్నారు. శనివారం పట్టణంని పార్టీ కార్యాలయంలో 9మంది బాధితులకు రూ.4.81లక్షలు చెక్కులను పంపిణీ చేశారు. తిమ్మయ్య చౌదరి, రామానాయుడు, బత్తినిలోకనాథ్, కడవల సుధాకర్, రంగన్న ఉన్నారు.

సమాజ సేవతో తృప్తి



సరుకులను అందజేస్తున్న సభ్యులు

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సమాజ సేవతోనే తృప్తి ఉంటుందని ఆదోని పబ్లిక్ రీడింగ్ రూమ్ అధ్యక్షుడు మల్లికార్జున అన్నారు. శనివారం ఎయిడ్స్ బాధిత పిల్లల కోసం ఫెయిత్ హోమ్‌కు నిత్యవసర వస్తువులను అంద జేశారు. రీడింగ్ రూమ్ వంద ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా వస్తువులను అందించామన్నారు. నిర్వాహకుడు డాక్టర్ డానియల్ ప్రేమ్ కుమార్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు దేవిశెట్టి ప్రకాష్ కార్యదర్శి తాతప్ప, శ్రీనివాస్ నటరాజ్ విరుపాక్ష గౌడ్ పాల్గొన్నారు.

ప్రధాని వైఖరి తగదు



ధర్నాలో మాట్లాడుతున్న గిడ్డయ్య

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అమెరికా సుంకాలపై ప్రధాని మోదీ మెతక వైఖరి తగదని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య అన్నారు. ట్రంప్ సుంకాలను వ్యతిరే కిస్తూ శనివారం పత్తికొండలో వామపక్ష నాయకులు ర్యాలీ నిర్వహించారు. దేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీసేలా ట్రంప్ వ్యవహరిస్తున్నా, మోదీ పట్టించుకోకపోవడం దేశ ప్రజలను అవమానపరచడమేనన్నారు. రామాంజినేయులు, రంగారెడ్డి, కారన్న, నెట్టికంటయ్య, దస్తగిరి, వెంకటరామిరెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇంకానా?

- హోలహర్వి మండలం సిద్ధాపురం గ్రామానికి రోడ్డులేకపోవడంతో డీఈవో ఆశ్చర్యం



గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఈవో శామ్యూల్‌పాల్

హాలహర్వి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్ధాపురం గ్రామానికి వచ్చిన డీఈవో శామ్యూల్ పాల్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఏమిటి గ్రామానికి రోడ్డు లేదు, బస్సులు లేవంటూ గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. శనివారం సిద్ధాపురంలో 'పల్లెకి పోదాం'లో భాగంగా ప్రత్యేక అధికారిగా వచ్చిన డీఈవో పల్లె పరిస్థితులను చూసి నివ్వెరపోయారు. ఇక్కడికి ఉపాధ్యా యులు రోజూ పల్లెలు ఇంత వెనుకబడి ఉన్నాయా, ఉపాధ్యాయులు రోజూ ఎలా వస్తున్నారని ప్రశ్నించారు. గ్రామానికి చెందిన బసవరాజుగౌడ్, రామన్నగౌడ్, సర్పంచ్ మారెన్న తమ కష్టాలను డీఈవోకు వివరించారు. కలెక్టర్‌కు చెప్పి గ్రామానికి రోడ్డు మంజూరు చేయించాలని కోరారు. స్పందించిన డీఈవో ఈ రోజే కలెక్టర్‌తో మాట్లాడతానని హామీ ఇచ్చారు.

వెల్దుర్తి: రత్నపల్లి గ్రామంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తులసీదేవి, మల్లెపల్లిలో ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ మురళీధర్‌రెడ్డి, నార్లాపురం గ్రామంలో సెరీకల్చర్ డీడీ ఆంజనేయులు పర్యటించారు. ఎంపీడీవో సుహాసినమ్మ, డిప్యూటీ ఎంపీడీ రవికిశోర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి



మాట్లాడుతున్న వెంకటపతి

తుగ్గలి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు సహకారంతో చెన్నంపల్లి పంచాయతీ అభివృద్ధి చెందినట్లు ట్రైబల్ వెల్ఫేర్ సలహా మండలి సభ్యుడు వెంకటపతి అన్నారు. శనివారం గ్రామంలో అధికారులు, ప్రజలతో మాట్లాడారు. మజరా గ్రామం కేపీ గుడిసెల్లో అన్ని వీధుల్లో సీసీ రోడ్లు నిర్మించాలమని, రామలింగాయపల్లె బీసీ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ.కోటి మంజూరయ్యాయన్నారు. కార్యదర్శి కార్తిక్ రంగనాథ్, ఉప సర్పంచ్ హుశేన్, రామయ్య, షేక్షావలి, అక్బర్, తదితరులు ఉన్నారు.

నరికేస్తున్నారు.. తరలిస్తున్నారు



హొళగుంద నుంచి ట్రాక్టర్‌లో తరలుతున్న కలప

హొళగుంద, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఓ వైపు మొక్కలు నాటి పరిరక్షించాలని, పర్యావరణాన్ని కాపాడా లని సూచిస్తుంటే కొందరు అక్రమార్కులు పచ్చని చెట్లను నరికి తరలిస్తున్నారు. హొళగుందతో పాటు ఎల్లార్తి, కోగిలతోట, వందవాగాలి గ్రామాల్లో ఏళ్లుగా ఉన్న పచ్చని చెట్లు గొడ్డలి వేటుకు నేలకు ఒరుగుతున్నాయి. అటవీ శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో ఈ దందా సాగుతోంది. ఇప్పటికైనా స్పందిం చాలని పర్యావరణ ప్రేమికులు కోరుతు న్నారు. ఈ విషయంపై అటవీశాఖ అధికారి మధును వివరణ కోరగా విచారణ చేసి సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేస్తామన్నారు.

తెగుళ్ల బారిన పత్తి

● పంటలో నీరు నిల్వ
● వరుస వర్షాలకు దెబ్బతిన్న పంటలు
● ఆందోళనలో అన్నదాతలు



చిలకలడోనలో పత్తి పంటలో నిలిచిన నీరు



మాధవరంలో పత్తి పంటలో ఆరని తడి



పత్తిపంటలో తొలగని నీరు

మంత్రాలయం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలో పది రోజులుగా కురిసిన భారీ వర్షాలకు పత్తి పంట నీటిలో మునిగి తీవ్ర నష్టాన్ని కలిగించింది. పొలాల్లో నీరు నిల్వగ ఉండటంతో పత్తి పంట ఎర్రగా మారి తెగుళ్ల సోకి పూత, మొగ్గ వాడిపోయి తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఈ ఏడాది ముందస్తు వర్షాలు పడటంతో ముందుగా పత్తి విత్తనాలు నాటినా కొన్ని రోజులు వర్షం లేక వరుణదేవుడు మొహం చాటేశాడు. అయితే.. గత పదిరోజులుగా కురుస్తున్న వర్షానికి తేమ శాతం ఎక్కువై పొలాల్లోనే నీళ్ల నిల్వగా ఉండటంతో వందలాది ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంత్రాలయం మండలంలో మాధవరం, చెట్నహళ్లి, సూగూరు, బూదూరు, మాలపల్లి, రచ్చమర్రి, చిలకలడోన, కల్లుదేవకుంట, పరమాన్‌దొడ్డి తదితర ప్రాంతాల్లో అధికంగా పత్తి పంటను ఈ ఏడాది అధికంగా సాగు చేయడం జరుగుతుంది. అయితే వర్షానికి తేమ శాతం ఎక్కువై పురుగు, దోమ, తెగుళ్ల వ్యాపించాయి. ఎంత పిచికారి చేసినా సాయంత్రానికి మరలా వర్షాలు పడటంతో రైతులు ఆశలన్నీ అడియాశలయ్యాయి. దీంతో దిక్కుతోచని పరిస్థితుల్లో ప్రభుత్వం పత్తి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు. దాదాపు వేయి ఎకరాలకు పైగా నష్టం వాటిల్లిందని తేరుకుంటుండగా.. వ్యవసాయాధికారులు వంకలు, వాగులు, కాలువలు దిగువ ప్రాంతాల్లో ఉన్న పొలాల్లో నీరు చేరి పంట నష్టం జరిగిందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. ఏదీ ఏమైనా కుండపోతగా కురుస్తున్న వర్షాలు మునిగిపోయిన రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఈ రైతు పేరు బోయ అయ్యన్న. చిలకలడోన గ్రామం.. ఐదెకరాల్లో పత్తి పంటను దాదాపు రూ.2 లక్షలు ఖర్చు చేసి సాగు చేశాడు. వరుసగా కురిసిన వర్షాలకు పండించిన పత్తి పంటలో నీరు నిల్వగా చేరి పంట కాయ కాస్తున్న సమయంలో కాయకుల్లు, మొగ్గ, రాలిపోయి తీవ్ర నష్టం వాటిల్లిందని వాపోతున్నాడు. మండలంలో దాదాపు 12 వేల మంది రైతులు ఈ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ అధికారులు పత్తి పంటకు జరిగిన నష్టాన్ని అందజేసి నష్టపరిహారం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ ఏడాది అత్యధికంగా 25వేల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేశారు.

పత్తి పంటకు నీటి శాతం లేకుండా జాగ్రత్త పడాలి

మండలంలో దాదాపు 25వేల వరకు పత్తి పంటను అత్యధికంగా సాగు చేశారు. వరుసగా కురిసిన వర్షాలతో పత్తి రైతులకు కొంత మేర నష్టం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా నదితీరం, వాగులు, దిగువ ప్రాంతాల్లో ఉన్న రైతుల పత్తి పొలాల్లో నీరు నిల్వ అయి తేమ శాతం ఎక్కువై పూత, పిందె కాయ రాలింది. కొంత మేర వర్షాలు తగ్గుముఖం పట్టడంతో యథాస్థితికి పత్తి పంట చేరే అవకాశం ఉందన్నారు. రైతులు తేమ శాతం అధికంగా ఉండకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

- జీర గణేష్, ఏవో, మంత్రాలయం

27న కోసిగిలో మెగా జాబ్ మేళా



మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి

కోసిగి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న కోసిగి మండల కేంద్రంలోని డి.బెళగల్ రోడ్డులో ఉన్న మౌంట్‌కార్నల్ హై స్కూల్‌లో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి తెలిపారు. ఈ మెగా జాబ్‌మేళాలలో 50 కంపెనీలు పాల్గొని సుమారు 5వేల ఉద్యోగాలు భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగులు పదో తరగతి, ఐటీఐ డిప్లమా, డిగ్రీ, బీ.ఫార్మశీ,పీజీ వంటి కోర్సులు చేసిన వారు 18 నుంచి 35 ఏళ్ల వయస్సు ఉన్న వారు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంత్రాలయం నియోజకవర్గం నాలుగు మండలాల యువతీ యువకులు కోసిగిలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని, 50 కంపెనీలకు పైగా ఈ జాబ్‌మేళాలో పాల్గొని నిరుద్యోగులకు 5వేలకు పైగా ఉద్యోగాలు భర్తి అవుతాయన్నారు. కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల కేంద్రమైన కోసిగిలో మౌంట్‌కార్నెల్ హై స్కూల్‌లో మొట్టమొదటి సారిగా గతంలో ఎన్నడూ ఏర్పాటు చేయని మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామనీ తెలిపారు. వివరాల కోసం 8019291249 ను సంప్రదించాలని, అలాగే మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి కార్యాలయంలో నిరుద్యోగ యువతీ యువకులు రిజిస్ట్రేషన్ కోసం సంప్రదించాలన్నారు.

ట్రంప్ విధానాలపై మోదీ మౌనం వీడాలి



సోమప్ప సర్కిల్‌లో రాస్తారోకో చేస్తున్న సీపీఐ నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి: భారతీయ ప్రయోజనాలను అనేక రకాలుగా అమెరికా దెబ్బతీస్తున్నా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మౌనం ప్రదర్శించడం ఏమిటని వామపక్ష పార్టీల నాయకులు రంగన్న, పంపన్నగౌడ్, గోవిందు, రాజు ప్రశ్నించారు. శనివారం ట్రంప్ విధించిన సుంకాలకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో స్థానిక సోమప్ప సర్కిల్‌లో రాస్తారోకో నిర్వహించారు. అమెరికా అధ్యక్ష వ్యవహార తీరుపై మోదీ ఉదాసీనత వైఖరి విడనాడాలన్నారు. కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు తిమ్మగురుడు, విజయేంద్ర, రాజీవ్, గిడ్డయ్య, ప్రసాద్, విరుపాక్షిరెడ్డి, ఖాజా, నరసింహులు, ఇస్మాయిల్, రాఘవేంద్రపాల్గొన్నారు.

'ఎరువుల కొరత సృష్టిస్తే చర్యలు'



రికార్డులను తనిఖీ చేస్తున్న మండల అధికారులు

కౌతాళం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి):మండలంలో ఎరువుల డీలర్లు, ఎరువుల విక్రయ దారులు యూరియా కొరతను కృత్రిమంగా సృష్టించి రైతులను మోసగిస్తే దుకాణాల లైసెన్స్‌లు, దుకాణాదారులపై కేసులు నమోదు చేస్తామని మండల తహసీల్దార్ రజినీకాంత్ రెడ్డి, మండల వ్యవసాయాధికారి రజినీకాంత్ రెడ్డిలు అన్నారు. శనివారం జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మండలంలో పరిధిలోని హల్వి గ్రామంలో ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి శేషాద్రి త హసీల్దార్ రజినీకాంత్ రెడ్డితో కలసి తనిఖీలు చేపట్టారు. అనంతరం యూరియా నిల్వల రికార్డులను తనిఖీ చేసారు.

ఘనంగా మోక్షజ్ఞ జన్మదిన వేడుకలు



కేక్ కట్‌చేస్తున్న నందమూరి అభిమానులు

ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీనటుడు నందమూరి బాలకృష్ణ తనయుడు నందమూరి మోక్షజ్ఞ జన్మదిన వేడుకలను శనివారం ఎమ్మిగనూరు పట్టణంలో నందమూరి అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక బస్టాండ్ సమీపంలోని హోటల్‌దగ్గర ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేక్‌ను అభిమానులు టీస్టాల్ చంద్ర, తెలుగురాముడు, రమేష్, రంగస్వామి గౌడ్, రంగస్వామి చౌదరిలు కట్‌చేసి మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో అభిమానులు ప్రకాష్, వీరేష్, రాముడు, నాగరాజు, బుడ్డప్ప, వెంకటేష్, అంజిని పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం ఏర్పాటు

గోనెగండ్ల, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రమైన గోనెగండ్లలోని ముస్లిం మైనార్టీల ఆధ్వర్యంలో శనివారం ఆయుర్వేద యూనాని వైద్యులు హాజీహకీమ్ సహకారంతో ఆయుర్వేద ఉచిత కంటి వైద్యశిభిరంను ఏర్పాటు చేశారు. ఈ ఉచిత కంటి వైద్య శిభిరంకు గ్రామ ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. ఈ వందలాదిమంది కంటి రోగాలుగల నిరుపేదలు హజరయ్యారు. వారికి పరీక్షించి ఉచితంగా కంటికి వేసుకునే చుక్కల మందులను అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు హజీహకీం మాట్లాడుతూ నిరుపేదలు వైద్యం చేయించుకునే తహతులేక పోవడంతో చూపును కోల్పోయి ఇబ్బందులు పడుతున్నారని తాను తయారు చేసిన యూనాని చుక్కల మందు ఎందరికో చూపును ప్రసాధించిందని తెలిపారు.

నేడు ఉరుకుంద ఆలయం మూసివేత

కౌతాళం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం తలుపులు మధ్యాహ్నం 1గంటకు మూసివేస్తున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్, ఈవో వాణి తెలిపారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం చంద్రగ్రహణం ఉండడంతో ఆదివారం మధ్యాహ్నం 1గంటకు ఆలయ ప్రధాన తలుపులు మూసివేస్తున్నట్లు తెలిపారు. తిరిగి ఆలయ తలుపులు చంద్రగ్రహణం అనంతరం అనగా సోమవారం తెల్లారుజామున 4-30లకు ఆలయ తెరుస్తామని చెప్పారు.

ఘనంగా అనంత చతుర్దశి వ్రత మహోత్సవం



పూజలు అందుకుంటున్న అనంత పద్మనాభస్వామి

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అనంత పద్మనాభస్వామి ఆలయంలో ఘనంగా అనంత చతుర్దశి వ్రత మహోత్సవం పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనంత పద్మనాభ స్వామి ఆలయ ధర్మకర్త ఆవుల గోపాల్, ఆలయ అర్చకులు మురళి స్వామిలు మాట్లాడుతూ ఆలయ నిర్మాణం చేపట్టి నేటికి ఎడు సంవత్సరాలు అయిందని, భాద్రపద శుద్ద చతుర్ధశిని పురస్కరించుకొని శనివారం శ్రీ అనంత పద్మనాభస్వామి వారికి అలంకరణ, పంచామృతాభిషేకంతో విశేష పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం దంపతులతో స్వామి వారి వ్రతోత్సవం మహా మంగళహరతిని వేద పండితులు ఇచ్చారు. వేడుకను తిలకించేందుకు కాలనీతో పాటు పట్టణ ప్రజలు కూడా పెద్ద ఎత్తున తరలిరావడంతో అ ప్రాంతమంతా భక్తులతో కళకళలాడింది. గోవింద నామస్మరణాన్ని ఉచ్చరిస్తూ భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకుని అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఎరువులు భూమికి ఎంతో మేలు



సూచనలు చేస్తున్న జిల్లా
సహాయ వ్యవసాయ సంచాలకులు వేదమణి

కోసిగి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో పశువుల ఎరువుల వినియోగం భూమికి ఎంతో మేలు చేస్తుందని, అలాగే పంటలకు నత్రజని ఎరువులు అందిస్తుందని, రసాయన ఎరువులు తగ్గించి పశువుల ఎరువుల వినియోగం పంటకు మేలు చేస్తుందని జిల్లా వనరుల సహాయ వ్యవసాయ సంచాలకులు జీ.ఎం.వేదమణి అన్నారు. శనివారం మండల కేంద్రమైన కోసిగి, దుద్ది గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో రైతులకు సమగ్ర వ్యవసాయ పద్ధతులపై మండల వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో కోసిగి, దుద్ది గ్రామాల రైతులకు పలు సూచనలుచేసి మాట్లాడారు. రైతులు ఏ పంటలోనైనా మంచి దిగుబడులు సాధించాలంటే ఎరువుల సమతుల్యత పాటించినప్పుడు ఏ పంటలోనైనా మంచి దిగుబడులు సాదించవచ్చని, డీఏపీ లాంటి బాస్వరం కలిగిన ఎరువులు దుక్కిలో వేసుకోవాలని, నత్రజని కలిగిన ఎరువులు పైపాటిగా వేసుకుంటే సరిపోతుందన్నారు. అలాగే పశువుల ఎరువుల వాడకం వలన పంటకు మేలు చేసే సిలింద్రాలు పెరగడమే కాకుండా వానపాముల ఉత్పత్తి పెరుగుతుందని వానపాముల వలన రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. వర్మి కంపోస్టు వినియోగంలో ఉపయోగాల గురించి రైతులకు సూచించారు. పంట దిగుబడిలో పొటాషియం వినియోగం చాలా కీలకమైనదని, దుక్కిలో పోటాష్ వినియోగం రైతులు విస్మరించవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ సిబ్బంది రాజన్న, సతీష్, గ్రామ వ్యవసాయ సహాయకురాలు ఇంద్రాణి, రైతులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణం శివారులోని ఉప్పర కొట్టాలలో రేషన్ బియ్యం పట్టుకున్నట్లు పట్టణ సీ ఐ శ్రీనివాసులు తెలిపారు. సీ ఐ తెలిపిన వివరాల మేరకు పట్టణ శివారులో ఎస్ ఐ మధుసుధన్‌రెడ్డి, ఇతర సిబ్బంది జరిపిన దాడులలో వెంకటసాయి రైస్ మిల్ పక్కన ఉన్న ఉప్పర కొట్టాలలో రేకుల షెడ్డుల్లో నిల్వ ఉంచిన 28 ప్యాకెట్ల బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు ఆ రేకుల షెడ్డు, బియ్యం ఎవరివి అనే వివరాలు తెలియాల్సిఉందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు.



రేకుల షెడ్డులో నిల్వ ఉంచిన రేషన్ బియ్యం

వైభవంగా అనంత పద్మనాభ వ్రతం



మూల రాములకు పూజలు చేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో రాఘవేంద్రస్వామి సన్నిధానంలో అనంతపద్మనాభ స్వామి వ్రతం అంగరంగ వైభవంగా నిర్వహించారు. శనివారం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు పూర్ణబోధ పూజా మందిరంలో మూలరాములు, జయరాములు, దిగ్విజయరాములకు బంగారు నాణేలతో అభిషేకం చేశారు. పద్మనాభ స్వామి అలంకరణలో స్వామివారిని అలంకరణ చేసి ప్రత్యేక అభిషేకాలు, హారతులు ఇచ్చారు. ఈ పూజలను కనులారా తిలకించి భక్తులు మంత్రముగ్దులయ్యారు. అనంత పద్మనాభ వ్రతాన్ని పురస్కరించుకుని రాఘవరాయుని బృంధావనాన్ని బంగారు, వెండి, పట్టువస్త్రాలు, గులాబి పుష్పాలతో చూడముచ్చటగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో మఠం ఏఏవో మాధవశెట్టి, శ్రీపతాచార్, సురేష్ కోనాపూర్, ఐపీ నరసింహమూర్తి, వాజేంద్రాచార్, పాల్గొన్నారు.

వైభవంగా అనంతపద్మనాభ వ్రతం : రాఘవేంద్రస్వామి సన్నిధానంలో అనంతపద్మనాభ స్వామి వ్రతం అంగరంగ వైభవంగా నిర్వహించారు. శనివారం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు పూర్ణబోధ పూజా మందిరంలో మూలరాములు, జయరాములు, దిగ్విజయరాములకు బంగారు నాణేలతో అభిషేకం చేశారు. పద్మనాభ స్వామి అలంకరణలో స్వామివారిని అలంకరణ చేసి ప్రత్యేక అభిషేకాలు, హారతులు ఇచ్చారు. ఈ పూజలను కనులారా తిలకించి భక్తులు మంత్రముగ్దులయ్యారు. అనంత పద్మనాభ వ్రతాన్ని పురస్కరించుకుని రాఘవరాయుని బృంధావనాన్ని బంగారు, వెండి, పట్టువస్త్రాలు, గులాబి పుష్పాలతో చూడముచ్చటగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో మఠం ఏఏవో మాధవశెట్టి, శ్రీపతాచార్, సురేష్ కోనాపూర్, ఐపీ నరసింహమూర్తి, వాజేంద్రాచార్, ప్రకాషాచార్‌లు పాల్గొన్నారు.

నేడు సంపూర్ణ చంద్రగ్రహణం:మంత్రాలయం రాఘవేంద్రస్వామి సన్నిధానంలో సంపూర్ణ చంద్రగ్రహణం శనివారం ఉండటంతో పూజల్లో మార్పులు చేశారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే రాఘవేంద్రస్వామి బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రహ్లాదరాయలకు పాద పూజ చేసి చెక్క, ఏనుగు, వెండి, బంగారు, నవరత్నాల రథాలు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ఊరేగిస్తారు. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు మధ్యాహ్నం 12గంటలలోపే సంస్థాన పూజ చేసి అష్టోదకం, మహా మంగళహారతి ఇస్తారు. మధ్యాహ్నం 1 గంట దాటిన తర్వాత ఎటువంటి పూజలు అన్నదానం, పరిమళ ప్రసాదం ఉండదని అధికారులు తెలిపారు.

'ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి'

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని జేఏసీ విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం విద్యార్థి సంఘాల నాయకులు ఉదయ్, ఆఫ్రిది, రఘులు మాట్లాడుతూ పాఠశాలలో అర్హత లేని ఉపాధ్యాయులచే బోధనలు జరుగుతున్నాయని, సరైన వసతులు లేకపోయినా విద్యార్థులు తల్లిదండ్రుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు. అదేవిధంగా బస్సులకు వ్యాన్లకు సరైన ఫిట్‌నెస్ లేకుండా పరిమితికి మించి విద్యార్థులను తరలించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, శేఖర్, ఖాజా, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డు గ్రహీతకు ఘన సన్మానం

మంత్రాలయం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న నరసింహరాజుకు స్పోర్ట్స్ ఎక్సలెంట్ అవార్డుతో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ, ఎంపీడీవో నూర్జహాన్, ఎంఈవో మైనుద్దీన్‌లు శాలువ, మెమెంటో ఇచ్చి సన్మానించారు. శనివారం జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో హెచ్‌ఎం విఠోభరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, టీడీపీ నాయకులు నరసింహరాజు చేసిన సేవలను కొనియాడుతూ సత్కరించారు. వ్యాయామ ఉపాధ్యాయుడగా నరసింహరాజు విద్యార్థులను జిల్లా, రాష్ట్ర, జాతీయ సాథయిలో ఎంపికయ్యేందుకు కృషి చేసినందుకు ఈ అవార్డు దక్కడం సంతోషమన్నారు టీడీపీ నాయకులు వరదరాజులు, ఎంపీటీసీ మేకల వెంకటేశ్, ఉపాధ్యాయులు గోపాల్, ఫిజికల్ డైరెక్టర్ రవీంద్ర, పాపన్న, శివ, తదితరులు పాల్గొన్నారు.

నవసమాజ నిర్మాతలు ఉపాధ్యాయులు

● ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవి



కార్యక్రమంలో పాల్గొన్న డీఎస్పీ భార్గవి, ఉపాధ్యాయులు

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు నవసమాజ నిర్మాతలు అని డీఎస్పీ భార్గవి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురష్కరించుకొని శనివారం మండలపరిదిలోని దైవందిన్నె జడ్పీ ఉన్నతపాఠశాలలో హెచ్‌ఎం గౌరమ్మ అధ్యక్షతన ఉపాధ్యయ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన డీఎస్పీ మాట్లాడుతూ తర తరాల భవిష్యత్తు, పౌరసమాజం వారి చేతుల్లో రూపకల్పన జరుగుతొందన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకొరకు ఉపాధ్యాయులు తమ సంతోషాన్ని కూడా వదులుకుంటున్నారన్నారు. ఏదైన విషయంలో విద్యార్థులను మందలించినా అదివిద్యార్థుల మేలుకోసమేనని భావించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అల్లయ్య గౌడ్, దాదాబాషా, మాదన్న, సంపత్ కుమర్, అబ్దుల్ రహీం, సుంకన్న, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ నెట్లేకల్లు, ఏఎస్‌ఐ ప్రాణేశ్వర రావు, గ్రామపెద్దలు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన దాసవాని సాహిత్యం

మంత్రాలయం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి సన్నిధానంలో యాగశాలలో ప్రత్యేక వేదికపై టీటీడీ దాససాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో దాసవాని సాహిత్యం భక్తులను అలరించింది. శనివారం చాతుర్మాస దీక్షల్లో భాగంగా దారవాడకు చెందిన పండిత్ బాలచంద్ర, రజని, ఖరిదర్, రాఘవేంద్ర, అనంత కులకర్ణి, సుమన్‌లు నిర్వహించిన సాహిత్యం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. భక్తి పాటలు, తబల, హార్మోన్లతో నోటి నుంచి వచ్చే ప్రతి పాటకు భక్తులు హర్షధ్వానాలు మోగించారు. సంగీతాన్ని మెచ్చి పీఠాధిపతి నగదు శేషవస్త్రం ఇచ్చి సత్కరించారు.

కోశాధికారిగా ఎంపికపై హర్షం

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఎమ్మిగనూరు పట్టణ కమిటీలో కోశాధికారిగా విజయలక్ష్మి ఎంపికపై 30వ వార్డు ప్రజలు, కార్యకర్తలు, దళితులు, బహుజన సంఘాలు హర్షం వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ ముందుగా నన్ను నమ్మి కోశాధికారి పదవి ఇచ్చిన ఎమ్మెల్యే బి వి జయనాగేశ్వర రెడ్డికి కృతజ్ఞతలు అన్నారు. టీ డీపీ కొరకు అహర్నిశలు కష్ట పడుతానని, పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని, పథకాలను ప్రజలలోకి తీసుకెళతానన్నారు. సావిత్రమ్మ, రాధ, పద్మ, వెంకటేశ్, రాముడు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

'పల్లెకు పోదాం'లో ప్రత్యేకాధికారులు

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారమే లక్ష్యమని డీఆర్‌డీఏ పీడీ, ప్రత్యేక అధికారి రమణారెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని టీఎస్ కూలూరు, బనవాసి, కడిమెట్ల గ్రామాల్లో 'పల్లెకు పోదాం' కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఇందులో భాగంగా టీఎస్ కూలూరు గ్రామంలో ప్రత్యేక అధికారి రమణారెడ్డితో పాటు, స్థానిక తహసీల్దార్ శేషఫణి పల్లెకుపోదాం కార్యక్రమంలో పాల్గొన్నారు.

కోసిగి:కూటమి ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పల్లెకు పోదాం కార్యక్రమంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రాలయం నియోజకవర్గం, కోసిగి మండల స్పెషల్ ఆఫీసర్, డీపీవో భాస్కర్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన కోసిగితో పాటు కడిదొడ్డి, ఆర్లబండ గ్రామాల్లో కలెక్టర్ ఆదేశాల మేరకు పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లు, ప్రభుత్వ ఆసుపత్రి, జగనన్న కాలనీలో పరిస్థితిని వారు పరిశీలించారు. కోసిగిలోని జిల్లా పరిషత్ బాలురు, బాలికల పాఠశాలలు ఇంటిగ్రేటెడ్ హాస్టల్, అంగన్‌వాడీ సెంటర్లు, కస్తూర్బా గాంధీ, మోడల్ స్కూల్ పాఠశాలలను తనిఖీ చేసి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం రుచి చూసి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

గోనెగండ్ల:గ్రామాలలో నె లకొన్న సమస్యలను గుర్తించి వాటి పై నివేదిక తయారు చేసేందుకు గాను జిల్లాలో 'పల్లెకు పోదాం' కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఏర్పాటు చేశారని జిల్లా అగ్రికల్చర్ జేడీ వరలక్ష్మి అన్నారు. శనివారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని ప్రభుత్వ పాఠశాలలను, అంగన్‌వాడీ కేంద్రాలను, బాలికల బీసీ హస్టల్ ను తనిఖీ చేశారు. రికార్డు లను పరిశీలించారు. ఉన్నత పాఠశాల యందు మధ్యహ్నభోజనంను పరిశీలించారు. బోజనం బాగుందన్నారు. అలాగే బీసీ హస్టల్ నందు వసతులన పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీవో మణిమంజరి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ శ్రీనివాసరెడ్డి, అధికారులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నందవరం: పల్లెకు పోదాం కార్యక్రమంతోనే సమస్యలన్ని పరిష్కార మతాయని జిల్లా పరిషత్ సీఈవో నాసరరెడ్డి అన్నారు. నందవరంలో శనివారం ఎంపీడీవో పుల్లయ్య ఆధ్వర్యంలో పల్లెకు పోదాం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీఈవో నందవరం హైస్కూల్‌ను పరిశీలించారు. టీచర్లు అందరు ఉన్నారా, విద్యార్థులకు మధ్యాహ్న బోజనం సక్రమంగా అందుతుందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఏమైనా ఉంటే చెప్పాలన్నారు.

పెద్దకడబూరు: ప్రతి ఉద్యోగి సక్రమంగా పనిచేయాలని పెద్దకడబూరు ప్రత్యేక అధికారి, ఆర్‌ఐవో నాగరాజురావు, లాలెప్ప అన్నారు. శనివారం మండల పరిధిలోని పీకలబెట్ట, నాగలాపురం, పెద్దకడబూరు గ్రామాల్లో పల్లెకుపోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు